

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 05-08-2025 | సంపుటి - 24 | సంచిక - 91 | రూ : 4 | పేజీలు: 8




అరణ్యభవన్‌లో

## టైగర్ సెల్ ఏర్పాటు

- రాష్ట్ర వన్యప్రాణి మండలి నిర్ణయం
- పెద్దగట్టు లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టుకు జాతీయ మండలి ఆమోదం

2లో

## రాష్ట్రపతితో ప్రధాని, హోంమంత్రి.. వరుస భేటీలు.. జమ్ము కశ్మీర్ కోసమా?

### రాష్ట్రపతితో గంటల వ్యవధిలో భేటీ అయిన ప్రధాని, హోంమంత్రి

- జమ్ము కశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ కోసమంటూ ప్రచారం
- ఆర్టికల్ 370ను రద్దు చేసి ఆరేళ్లు

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వరుసగా సమావేశమయ్యారు. ఆదివారం గంటల వ్యవధిలోనే వీరు రాష్ట్రపతితో భేటీ అయ్యారు. ఈ వరుస సమావేశాలపై అధికారిక ప్రకటన వెలువడనప్పటికీ, పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. జమ్ము కశ్మీర్‌కు రాష్ట్ర హోదా

తరువాయి 2లో





## హైదరాబాదులో.. దంచి కొట్టిన వర్షం

- హైదరాబాద్‌లో సోమవారం సాయంత్రం భారీ వర్షం
- జలమయమైన రోడ్లతో పూర్తిగా స్తంభించిన ట్రాఫిక్
- ఐటీ కారిడార్, కోఠి, బేగంబజార్‌లో తీవ్ర ఇబ్బందులు
- రంగంలోకి దిగిన జీహెచ్ఎంసీ, పోలీసు బృందాలు
- అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని ప్రజలకు సూచన

2లో



## ఇవేం మాటలు?...

### రాహుల్ గాంధీపై సుప్రీంకోర్టు ఆగ్రహం

- చైనాతో సరిహద్దులో భారత సైన్యం సరిగా పోరాడలేదన్న రాహుల్
- పరువు నష్టం కేసు దాఖలు చేసిన బీజేపీ నేత
- ఈ కేసుపై స్టే ఇచ్చిన అత్యున్నత న్యాయస్థానం
- ఆచితూచి వ్యాఖ్యలు చేయాలంటూ రాహుల్ కు హితవు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత సైన్యం గురించి చేసిన వ్యాఖ్యలపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. "దేశభక్తి ఉన్న ఏ భారతీయుడూ ఇలాంటి వ్యాఖ్యలు చేయడు" అని కోర్టు అభిప్రాయపడింది. అయితే, ఈ వ్యాఖ్యలకు సంబంధించిన పరువు నష్టం కేసులో

తరువాయి 2లో

# అసెంబ్లీకి ఘోష్ నివేదిక

### సభలో చర్చించి అన్ని రాజకీయపక్షాల అభిప్రాయాలను స్వీకరిస్తాం

- అనంతరమే భవిష్యత్ కార్యాచరణ
- కమిషన్ సూచనలను ప్రభుత్వం తప్పకుండా పాటిస్తుంది
- ఇందులో ఎలాంటి శషభిషలు లేవు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- కాళేశ్వరం నివేదికకు మంత్రిమండలి ఆమోదం

2లో





నేను ప్రారంభించిన ఉద్యమానికి

## ఆయన అండగా నిలిచారు

- శిబు సోరెన్ మృతి పట్ల కేసీఆర్ విచారం
- ప్రాంతీయ అస్తిత్వ రాజకీయాలకు తీరని లోటు అని వ్యాఖ్య
- 2022లో ఆయన ఆశీస్సులు తీసుకున్నానని వెల్లడి

జేఎంఎం అధినేత, ఝార్ఖండ్ మాజీ సీఎం శిబూ సోరెన్ మృతి పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విచారం వ్యక్తం చేశారు. ఆయన మరణం తెలంగాణ, ఝార్ఖండ్ వంటి దేశ ప్రాంతీయ అస్తిత్వ రాజకీయాలకు, ఫెడరల్ స్ఫూర్తికి, ఆదివాసీ సమాజానికి తీరని లోటు అని ఆయన అన్నారు. శిబూ సోరెన్ చేపట్టిన ఝార్ఖండ్ స్వరాష్ట్ర ఏర్పాటు ఉద్యమం ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి స్ఫూర్తి అని చెప్పారు. 2001లో

తరువాయి 2లో

సెప్టెంబర్ 1 నుంచి..

# కొత్త బార్ పాలసీ: సీఎం చంద్రబాబు



: ఏపీ కొత్త బార్ పాలసీపై సీఎం చంద్రబాబు

- ఆదాయం కాదు, ఆరోగ్యమే ముఖ్యం
- ఆదాయం కన్నా ప్రజల ఆరోగ్యానికే ప్రాధాన్యం
- పేదల కుటుంబాలు నష్టపోకుండా చూడాలన్న సీఎం
- గీత కార్మికులకు బార్లలో 10 శాతం రిజర్వేషన్
- లాటరీ పద్ధతి ద్వారా బార్ లైసెన్సుల కేటాయింపు
- సెప్టెంబర్ నాటికి రాష్ట్రవ్యాప్తంగా నాటుసారా నిర్మూలన లక్ష్యం

2లో



2లో

## కాళేశ్వరం ప్రాజెక్టుపై అప్పులు..

### తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం కీలక సూచన

- కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేస్తే అప్పులపై వడ్డీని తగ్గించే అంశం పరిశీలిస్తామని హామీ
- ప్రాజెక్టు రుణాల పునర్వ్యవస్థీకరణ కోసం తెలంగాణ నుంచి వినతులు వచ్చాయన్న కేంద్రం
- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం

# రాష్ట్రపతితో ప్రధాని, హోంమంత్రి వరుస భేటీలు.. జమ్ము కశ్మీర్ కోసమా?

(మొదటి పేజీ తరువాయి)

పునరుద్ధరణ కోసమే ఈ భేటీలు జరిగాయని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతోంది. ఆర్టికల్ 370 రద్దు చేసి ఆరేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఈ సమావేశాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. బ్రిటన్, మాల్దీవుల పర్యటన తర్వాత రాష్ట్రపతిని ప్రధాని నరేంద్ర మోదీ కలవడం ఇదే మొదటిసారి. ఆ తర్వాత కొన్ని గంటలకు రాష్ట్రపతితో అమిత్ షా సమావేశమయ్యారు. హోంమంత్రి ఆ తర్వాత జమ్ము కశ్మీర్ నేతలను కలిశారు. జమ్ము కశ్మీర్‌కు ప్రత్యేక హోదాను కల్పించే ఆర్టికల్ 370ని కేంద్రం 2019 ఆగస్టు 5న రద్దు చేసింది. రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించింది. అదే ఆగస్టు 5కు రెండు రోజుల ముందు కీలక భేటీలు జరగడం గమనార్హం. కచ్చితమైన గడువును నిర్దేశించనప్పటికీ, రాష్ట్ర హోదా పునరుద్ధరణకు పలుమార్లు ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా హామీ ఇచ్చారు.

# హైదరాబాదులో దంచి కొట్టిన వర్షం... ట్రాఫిక్ కష్టాలు

భాగ్యనగరాన్ని సోమవారం సాయంత్రం భారీ వర్షం ముంచెత్తింది. పగలంతా ఎండతో అల్లాడిన నగరవాసులకు, సాయంత్రం ఒక్కసారిగా కురిసిన కుండపోత వర్షం ఊహించని కష్టాలను తెచ్చిపెట్టింది. అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో మొదలైన వాన, గంటల తరబడి దంచి కొట్టడంతో నగరంలోని ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. దీంతో కార్యాలయాల నుంచి ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నగరంలోని ఐటీ కారిడార్, బేగంబజార్, కోఠి, అమీర్‌పేట, పంజాగుట్ట వంటి కీలక ప్రాంతాల్లో వర్షం ప్రభావం తీవ్రంగా కనిపించింది. రోడ్లపై భారీగా నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు గంటల తరబడి రోడ్లపైనే చిక్కుకుపోయారు. లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరడంతో స్థానిక ప్రజలు ఆందోళనకు గురయ్యారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ), నగర పోలీసు యంత్రాంగం వెంటనే రంగంలోకి దిగాయి. జీహెచ్ఎంసీకి చెందిన అత్యవసర బృందాలు రోడ్లపై నిలిచిన నీటిని తొలగించే పనులను ముమ్మరం చేశాయి. మరోవైపు, ట్రాఫిక్ పోలీసులు వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల్లో మళ్లిస్తూ ట్రాఫిక్‌ను నియంత్రించే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో, నగర పోలీసులు ప్రజలకు కీలక సూచనలు జారీ చేశారు. అత్యవసర పనులు ఉంటే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని విజ్ఞప్తి చేశారు. వర్షం తీవ్రత కొనసాగే అవకాశం ఉన్నందున, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. వర్షం కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో కూడా అంతరాయం ఏర్పడినట్లు సమాచారం అందింది.

# ఇవేం మాటలు?... రాహుల్ గాంధీపై సుప్రీంకోర్టు ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

రాహుల్ గాంధీకి తాత్కాలిక ఊరట లభించింది. ఇటీవల ఒక కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, "మన భారత ఆర్మీ చైనా సరిహద్దులో సరైన విధంగా పోరాడలేదు" అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ నాయకుడు ఒకరు రాహుల్ గాంధీపై పరువు నష్టం కేసు దాఖలు చేశారు. ఈ కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు రాహుల్ గాంధీ వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుపట్టింది. అయినప్పటికీ, కోర్టు ఈ కేసుపై స్టే జారీ చేసింది. రాహుల్ గాంధీ తరపున వాదించిన న్యాయవాది, ఆయన వ్యాఖ్యలను వక్రీకరించారని, సైన్యాన్ని అవమానించే ఉద్దేశం రాహుల్ గాంధీకి లేదని కోర్టులో వాదించారు. ఈ వాదనను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు, పరువు నష్టం కేసుపై స్టే ఇచ్చింది. అయితే, రాహుల్ గాంధీ వంటి బాధ్యతాయుత రాజకీయ నాయకులు ఇలాంటి వ్యాఖ్యలు చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని కోర్టు సూచించింది.

# నేను ప్రారంభించిన ఉద్యమానికి ఆయన అండగా నిలిచారు: కేసీఆర్

(మొదటి పేజీ తరువాయి)

టీఆర్ఎస్ పార్టీ స్థాపన సమయంలో హైదరాబాద్ లో జరిగిన తొలి సభకు మొదటి అతిథిగా ఆయనను ఆహ్వానించుకున్నామని కేసీఆర్ తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేంద్రంలో ఉన్న యూపీఏ ప్రభుత్వంలో జేఎంఎం భాగస్వామిగా ఉందని... రాష్ట్ర ఏర్పాటు కోసం కేంద్రంపై ఒత్తిడి తేవడంలో కీలక పాత్ర పోషించిందని చెప్పారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం 2022లో ఝార్ఖండ్ లో శిబు సోరెన్ ను కలిసి వారి ఆశీస్సులు తీసుకున్నానని కేసీఆర్ తెలిపారు. శిబు సోరెన్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి కుమారుడు, ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# అరణ్యభవన్‌లో టైగర్ సెల్ ఏర్పాటు

హైదరాబాద్: అటవీ ప్రాంతంలో పెద్దపులులు, చిరుతల కదలికల్ని గమనించేందుకు హైదరాబాద్‌లోని అరణ్యభవన్‌లో 'టైగర్ సెల్' ఏర్పాటుచేయాలని రాష్ట్ర వన్యప్రాణి మండలి నిర్ణయించింది. కవ్వాల్ టైగర్ రిజర్వులో భారీ వాహనాల రాకపోకల ప్రభావంపైనా అధ్యయనం చేయాలని పేర్కొంది. అటవీశాఖ మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన తెలంగాణ వైల్డ్‌లైఫ్ ప్రొటెక్షన్ బోర్డు 9వ సమావేశం సచివాలయంలో సోమవారం జరిగింది. పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కతోపాటు ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, మురళీనాయక్, రామ్‌దాస్‌నాయక్, వెడ్మ బొజ్జు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. అడవుల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తామని, అటవీ చట్టాల ఉల్లంఘనల్ని అనుమతించబోమని స్పష్టం చేశారు. ఆదివాసీల హక్కుల విషయంలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సమావేశంలో కేంద్ర, రాష్ట్ర వన్యప్రాణి మండళ్లు తీసుకున్న నిర్ణయాలపై చర్చించారు. ఆ వివరాలు..

* అటవీ ప్రాంతాల్లో ఆరు రహదారులకు ప్రతిపాదనలు రాగా.. ఒక రోడ్డును జాతీయ వన్యప్రాణి మండలి ఆమోదించింది. ఐదింటిని తిరస్కరించింది.
* ములుగులో 11 కేవీ సబ్‌స్టేషన్, యాక్సెస్ రోడ్డు నిర్మాణానికి పర్యావరణంపై ప్రభావం దృష్ట్యా తిరస్కరించింది.
* పెద్దగట్టు లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు (నల్గొండ)కు ఆమోదం తెలిపింది.
* పీఎంజీఎస్‌వై కింద 18, రోడ్లు భవనాల కింద 4 గ్రామీణ రహదారి ప్రాజెక్టులకు ఉన్న మార్గాలను పరిశీలించాలని రాష్ట్ర వన్యప్రాణి మండలి నిర్ణయించింది.
* అటవీ చెక్‌పోస్టుల ఆదాయం అటవీ సంక్షేమానికి వినియోగించాలని సూచించింది.
* కవ్వాల్ టైగర్ రిజర్వులో భారీ వాహనాల రాకపోకలతో మరణాలు, శబ్ద, వాయు కాలుష్యంపై అధ్యయనం చేసి తదుపరి చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది.



# సెప్టెంబర్ 1 నుంచి కొత్త బార్ పాలసీ: సీఎం చంద్రబాబు

మద్యం పాలసీ అనగానే దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వాలైనా ఆదాయం గురించి చూస్తాయని... కానీ మద్యం పాలసీ అంటే ఆదాయమే కాదని.. ప్రజల ఆరోగ్యమే ముఖ్యమనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఆల్కహాల్ కంటెంట్ తక్కువ ఉన్న మద్యం ద్వారా మద్యం వినియోగదారుల ఆరోగ్యాన్ని చాలా వరకు కాపాడవచ్చు అని సీఎం అన్నారు. మద్యం పాలసీ అంటే ఆదాయం మాత్రమే అని భావించొద్దని...ప్రజల ఆరోగ్యాలు ప్రధానమైన అంశమనే విషయాన్ని కూడా గుర్తుపెట్టుకోవాలని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో నాణ్యత లేని మద్యం కారణంగా కొన్ని లక్షల కుటుంబాలు నష్టపోయాయన్న విషయాన్ని సీఎం గుర్తుచేశారు. పేదల ఇల్లు, ఒళ్లు గుల్ల కాకుండా చూడాల్సిన అవసరం ఉందని సీఎం స్పష్టం చేశారు. సోమవారం నాడు సీఎం చంద్రబాబు సచివాలయంలో ఆబ్కారీ శాఖపై సమీక్ష చేపట్టారు. మంత్రులు కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాస్, అధికారులు ఈ సమీక్షకు హాజరయ్యారు. ప్రస్తుతం ఉన్న బార్ పాలసీ గడువు తీరడంతో.... సెప్టెంబర్ 1 నుంచి కొత్త పాలసీ రావాల్సి ఉంది. అధికారులు సీఎంకు కొత్త పాలసీపై ప్రతిపాదనలు వివరించారు. మంత్రివర్గ ఉపసంఘం ఇచ్చిన నివేదిక, ప్రతిపాదనల ఆధారంగా కొత్త పాలసీకి రూపకల్పన చేసినట్లు సీఎం తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 840 బార్లు ఉన్నాయి. కొత్త పాలసీలో లాటరీ పద్ధతి ద్వారా బార్లకు అనుమతులు ఇస్తారు. 50 వేల లోపు జనాభా ఉంటే రూ.35 లక్షలు, 5 లక్షల లోపు జనాభా ఉంటే రూ.55 లక్షలు, 5 లక్షల పైన జనాభా ఉంటే రూ.75 లక్షల చొప్పున లైసెన్స్ ఫీజు ఏడాదికి పెట్టాలనే ప్రతిపాదన మంత్రివర్గ ఉప సంఘం నుంచి వచ్చింది. కొత్త పాలసీలో అప్లికేషన్ ఫీజ్, లైసెన్స్ ఫీజు ద్వారా రూ.700 కోట్ల ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేశారు. ప్రతి బార్ కు కనీసం 4 అప్లికేషన్లు రావాలనే నిబంధనను పెట్టనున్నారు. బార్ పాలసీలో కూడా గీత కులాలకు 10 శాతం బార్లు దక్కేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు. లిక్కర్ షాపుల్లో ఎలా అయితే 10 శాతం వారికి ఇచ్చారో... అదే విధంగా బార్లలో కూడా ఆ వర్గాలకు బార్లు కేటాయించనున్నారు. పొరుగు రాష్ట్రాల పరిధిలో సరిహద్దుల్లో లిక్కర్ సేల్స్ పెరగడానికి గల కారణాలు కూడా అధికారులు సీఎంకు వివరించారు. ఏపీలో రేట్లు తగ్గడం, అన్ని బ్రాండ్లు అందుబాటులో ఉండడం, నాణ్యమైన మద్యం దొరకడంతో మన రాష్ట్రానికి చెందిన మద్యం వినియోగదారులు ఇక్కడే మద్యం కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. దీంతో మన దగ్గర సరిహద్దు ప్రాంతాల్లోని లిక్కర్ షాపుల్లో సేల్స్ పెరగగా.... పొరుగు రాష్ట్రాల్లో సేల్స్ తగ్గాయని అధికారులు తెలిపారు. గతంలో మన రాష్ట్రంలో నాణ్యమైన మద్యం లేకపోవడం, అధిక ధరలు, మంచి బ్రాండ్లు దొరక్కపోవడం వల్ల ఇక్కడి వాళ్లు పొరుగు రాష్ట్రాలకు వెళ్లి మద్యం తాగేవాళ్లని గుర్తు చేశారు. మరోవైపు దీన్ని సొమ్ము చేసుకోవడానికి అక్రమంగా ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తెచ్చే వాళ్లని... ఇప్పుడు ఆ సమస్య లేకుండా పోయిందని అధికారులు చెప్పారు. అయితే ఇప్పుడు 12 జిల్లాల్లో పూర్తి స్థాయిలో ఐడీ లిక్కర్ ఫ్రీ జిల్లాలుగా ప్రకటించామని... ఈ నెలలో మరో 8 జిల్లాలను ఇల్లిసిట్లీ డిస్టిల్డ్ లిక్కర్ (ఐడి లిక్కర్) ఫ్రీ జిల్లాలుగా ప్రకటిస్తామని చెప్పారు. సెప్టెంబర్ నాటికి మిగిలిన 6 జిల్లాలను కూడా ఐడీ లిక్కర్ ఫ్రీ జిల్లాలుగా ప్రకటిస్తామని అధికారులు సీఎంకు తెలిపారు.

# అసెంబ్లీకి ఘోష్ నివేదిక



''ఊరు, పేరు, అంచనాలు మార్చి.. అవినీతికి పాల్పడి.. అక్రమాలకు పునాదులు వేసి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ఈ రోజు కూలిపోయింది. కమిషన్ స్పష్టంగా ఈ వివరాలన్నింటినీ పొందుపర్చింది. ఈ నివేదికను రాబోయే రోజుల్లో శాసనసభ, మండలిలోనూ ప్రవేశపెట్టి, అన్ని రాజకీయ పక్షాలకూ వారి అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పే అవకాశం కల్పించనున్నాం. ఈ మేరకు మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నాం. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత.. భవిష్యత్ కార్యాచరణకు.. కమిషన్ సూచనలను అమలు చేయడానికి ప్రభుత్వం ముందుకు వెళ్తుంది. ఇందులో ఎలాంటి శషభిషలకు తావు లేదు'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ''రాజకీయ కక్షపూరిత చర్యలు చేపట్టినట్టో.. ఎవరి మీదనో వ్యక్తిగతంగా ద్వేషంతో నిర్ణయాలు తీసుకున్నట్టో.. చర్చలకు తావివ్వకుండా.. ప్రభుత్వం పారదర్శకంగా పనిచేయాలనుకుంటోంది. కాబట్టే ఈ రోజు కమిషన్ నివేదికలోని అన్ని వివరాలను మీ ముందు పెట్టాం'' అని సీఎం వెల్లడించారు. సచివాలయంలో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గం సమావేశమైంది. ఇందులో 665 పేజీల జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను ప్రవేశపెట్టారు. దీనిపై ముగ్గురు అధికారుల కమిటీ రూపొందించిన సంక్షిప్త నివేదికను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంత్రివర్గ సహచరులకు వివరించారు. అనంతరం జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికను మంత్రిమండలి ఆమోదించింది. తర్వాత నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వివేక్, దామోదర్ రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నంప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వాకిటి శ్రీహరి, సీతక్క, కొండా సురేఖ, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. మాట ఇచ్చాం.. నిలబెట్టుకున్నాం ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ''200708లో ఉమ్మడి ఏపీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించిన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును తెలంగాణ రాష్ట్రం వచ్చిన సంవత్సరంన్నర తర్వాత మార్చారు. ప్రాజెక్టు రీడిజైనింగ్ పేరిట తుమ్మిడిహెట్టి దగ్గరి నుంచి చేవెళ్ల వరకూ తీసుకురావాలన్న ప్రణాళికలను ఆనాటి సీఎం కేసీఆర్ మార్చి.. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాంతాల్లో ప్రాజెక్టులు నిర్మించారు. 201516లో మొదలుపెట్టి 201819లోపు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొచ్చామని కేసీఆర్ చెప్పారు. నిర్మించిన కొద్ది కాలానికే 2023 అక్టోబరులో మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడం.. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు పగుళ్లు రావడంతో.. ప్రాజెక్టులు ప్రమాదంలో పడ్డాయని సాంకేతిక నిపుణులు, ఎన్డీఎస్ఏ సహా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు గుర్తించాయి. వాటిపై విచారణ చేపట్టాయి. ప్రణాళిక, నిర్మాణ, నిర్వహణ లోపాలున్నాయని, పూర్తిస్థాయిలో విచారణ జరగాలని.. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికల్లో సూచించాయి. ఆ సందర్భంలో పీసీసీ అధ్యక్షుడుగా ఉన్న నేను, మా నాయకుడు రాహుల్‌గాంధీ మేడిగడ్డను సందర్శించాం. ఇందులో అవినీతి, అశ్రితపక్షపాతం, నిర్లక్ష్య వైఖరి, ఎన్నో లోపాలతో కూడుకున్న నిర్ణయాలున్నాయని, అందువల్లే రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం పూర్తిగా కూలిపోయిందని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే.. న్యాయ విచారణకు ఆదేశిస్తామని ఆనాడు మాట ఇచ్చాం. ఆ మాట ప్రకారం.. 14.03.2024న జస్టిస్ పీసీ ఘోష్ ఛైర్మన్‌గా జ్యుడిషియల్ కమిషన్‌ను విచారణకు నియమించాం. దాదాపు 16 నెలలు ఘోష్ కమిషన్.. నాటి ముఖ్యమంత్రి, అప్పటి సాగునీటి, ఆర్థిక మంత్రులు.. ఐఏఎస్, ఇంజినీరింగ్ అధికారులు, నిర్మాణ సంస్థలు, ప్రజాసంఘాలు, పాత్రికేయులు, ముందుకొచ్చిన ప్రజల నుంచి సమాచారాన్ని సేకరించింది. కేసీఆర్, హరీశ్‌రావు, ఈటలను ప్రశ్నించి... వారి వివరణను విశ్లేషించింది. గత నెల 31వ తేదీన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసింది. దాన్ని సంక్షిప్తంగా విశ్లేషించడానికి ప్రభుత్వం నియమించిన ముగ్గురు అధికారుల కమిటీ ఇచ్చిన నివేదికను మంత్రివర్గ సమావేశంలో వివరించాం. పీసీ ఘోష్ కమిషన్ నివేదికను మంత్రివర్గంలో ప్రవేశపెట్టి ఆమోదించాం'' అని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. ''భారాస ఈ నివేదికను తప్పుపట్టడం సహజమే. తమకు అనుకూలంగా ఉంటే ఒక రకంగా.. తమ తప్పులను ప్రశ్నిస్తే మరో రకంగా మాట్లాడడం వారికున్న అలవాటే. ఇది ఒక స్వతంత్ర న్యాయ విచారణ కమిషన్. ప్రభుత్వ నివేదిక కాదు. దీనిపై ఇక ఎవరు ఏ రకంగా మాట్లాడతారు.. ఏ రకంగా విశ్లేషిస్తారు.. అనేది వారి విజ్ఞతకే వదిలేస్తున్నా'' అని ఒక ప్రశ్నకు సమాధానంగా సీఎం చెప్పారు. ''భారాస ఎమ్మెల్సీ కవిత కూడా ఘోష్ కమిషన్‌కు తన అభిప్రాయాలు చెప్పాల్సింది. ఇప్పుడు నివేదిక ఇచ్చిన తర్వాత ఆమె ఎవరిని ప్రశ్నిస్తున్నారు?'' అని మరో ప్రశ్నకు ముఖ్యమంత్రి సమాధానమిచ్చారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుపై అప్పులు...

# తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం కీలక సూచన

కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసిన తర్వాత అప్పులపై వడ్డీని తగ్గించే అంశాన్ని పరిశీలిస్తామని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. రుణాల చెల్లింపు, రీషెడ్యూల్ మార్పులు చేస్తే ఆర్బీఐ నిబంధనల మేరకు కాళేశ్వరం ప్రాజెక్టు ఖాతా స్టాండర్డ్ నుంచి సబ్ స్టాండర్డ్‌కు డౌన్ గ్రేడ్ అవుతుందని కేంద్ర ఆర్థిక శాఖ తెలిపింది. తెలంగాణ కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అడిగిన ప్రశ్నకు లోక్‌సభలో కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు రుణాల పునర్వ్యవస్థీకరణ చేయాలని తెలంగాణ ప్రభుత్వం నుంచి వినతులు వచ్చాయని తెలిపారు. ప్రాజెక్టు స్పెషల్ పర్పస్ వెహికిల్‌కు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పోరేషన్ రుణాలు ఇచ్చాయని వెల్లడించారు. పీఎఫ్‌సీ, ఆర్ఈసీ లాంటి నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థలు వివిధ మార్గాల్లో నిధులు సేకరిస్తాయని, వాటికయ్య ఖర్చుల ఆధారంగా వడ్డీ రేట్లను నిర్ణయిస్తాయని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తయ్యే సమయాన్ని ఇప్పటికే 2024 డిసెంబరుకు ఆర్ఈసీ పొడిగించినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయ్యాకే రుణాలపై వడ్డీ రేట్లను నిర్ణయిస్తామని స్పష్టం చేశారు.

# కుంకీ ఏనుగుల తొలి ఆపరేషన్ విజయవంతం : పవన్ కల్యాణ్



ఆంధ్రప్రదేశ్‌లో ఏళ్ల తరబడి రైతులను వేధిస్తున్న ఏనుగుల సమస్యకు పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రాష్ట్రంలో తొలిసారిగా చేపట్టిన 'ఆపరేషన్ కుంకీ' విజయవంతమైందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రకటించారు. చిత్తూరు జిల్లా, బంగారుపాళ్యం మండలం మొగిలి ప్రాంతంలో పంటలను ధ్వంసం చేస్తున్న అడవి ఏనుగుల గుంపును.. శిక్షణ పొందిన కుంకీ ఏనుగులు విజయవంతంగా అడవిలోకి తరిమికొట్టాయని వెల్లడించారు. ఈ ఆపరేషన్ సఫలం కావడంతో సరిహద్దు ప్రాంతాల రైతులకు భరోసా లభించినట్లయిందని పేర్కొన్నారు. "గత 15 రోజులుగా మొగిలి ప్రాంతంలోని మామిడి తోటలపై అడవి ఏనుగుల గుంపు దాడులు చేస్తూ తీవ్ర నష్టం కలిగిస్తోంది. ఈ సమాచారంతో అప్రమత్తమైన అటవీ శాఖ అధికారులు 'ఆపరేషన్ కుంకీ'కి శ్రీకారం చుట్టారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఈ ఆపరేషన్‌ను కొనసాగించారు. ఇందులో భాగంగా కర్ణాటక నుంచి ప్రత్యేకంగా తెప్పించిన కృష్ణ, జయంత్, వినాయక అనే మూడు కుంకీ ఏనుగులను రంగంలోకి దించారు. ఈ కుంకీలు అడవి ఏనుగుల గుంపును ధైర్యంగా ఎదుర్కొని, తిరిగి అటవీ ప్రాంతంలోకి వెళ్లేలా దారి మళ్లించాయని అధికారులు తెలిపారు. ముఖ్యంగా 'కృష్ణ' అనే కుంకీ చాలా చురుగ్గా వ్యవహరించి ఆపరేషన్ విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించిందని వారు పేర్కొన్నారు. మొగిలి ప్రాంతంలో 15 రోజులుగా ఏనుగుల సంచారం ఉన్న సమాచారంతో అధికారులు ఈ ఆపరేషన్ చేపట్టారు. కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులను తీసుకువచ్చిన అనంతరం రెండు నెలల శిక్షణ తర్వాత మొదటి ఆపరేషన్ విజయవంతంగా చేపట్టడం ఆనందాన్నిచ్చింది. ఏనుగుల సంచారంతో ఇబ్బందులు పడుతున్న సరిహద్దు ప్రాంతాల రైతులు, ప్రజలకు ఈ ఆపరేషన్ భరోసా ఇస్తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు గారి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏనుగుల గుంపు నుంచి పంటలను, ప్రజల ప్రాణాలు కాపాడే దిశగా ప్రణాళికాబద్ధంగా పని చేస్తుంది అనడానికి కుంకీలతో చేపట్టిన ఆపరేషన్ తొలి అడుగు. ఈ ఆపరేషన్ లో పాల్గొన్న అటవీ అధికారులకు, మావటిలు, కావడిలకు అభినందనలు తెలియజేస్తున్నాను. అలాగే అడిగిన వెంటనే కుంకీ ఏనుగులు రాష్ట్రానికి ఇచ్చి సహకరించిన కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గారికి, ఆ రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే గారికి మరోసారి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. తదుపరి ఆపరేషన్ పుంగనూరు అటవీ ప్రాంతంలో చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు" అని పవన్ కల్యాణ్ వెల్లడించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరుతో ప్రజలు సంతోషంగా ఉన్నారు

* ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరుతో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. డివిజన్ పరిధిలోని మొగులమ్మ కాలనీ లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా. కాలనీ లో పర్యటించి కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి , సంక్షేమ పథకాల గురించి , ప్రభుత్వ పనితీరు గురించి ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని మొగులమ్మ కాలనీ లో ముప్పై ఆరు లక్షల యాభై వేల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను పరిశీలించడం జరిగిందన్నారు. మహిళలకు ఉచిత బస్, ఉచిత కరెంట్, గ్యాస్, సన్న బియ్యం వంటి మొదలగు పథకాలతో ప్రజలు ప్రభుత్వం పట్ల సానుకూలంగా ఉన్నట్లు తెలియచేసారు. నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డుకు ఇరువైపులా అంచుల వద్ద మట్టి వేయాలని, మంచిగా క్యూరింగ్ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెట్టి కాలనీని పచ్చని వనంలా సుందరంగా మార్చుకోవాలని కాలనీ వాసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, సీహెచ్.భాస్కర్, జాన్, శ్యాముల్, మహేష్, బషీర్, విక్రమ్, ఆయుబ్, నరేష్, రఫీ, పాషా.మియా, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## బోడుప్పల్ ను చల్లగా చూసే బాధ్యత నాదే

* ప్రతీ ఏటా అంగరంగ వైభవంగా బోనాలు సమర్పిస్తున్నారు
* ముగిసిన బోనాల పండుగ - రెండవ రోజు ఘనంగా రంగం,భవిష్యవాణి



మేడిపల్లి, ప్రజాస్ఫూర్తి :బోడుప్పల్ ప్రజలను కంటికిరెప్పల కాపాడు కునే బాధ్యత నాదేనని,ప్రతి ఏటా నాకు మొక్కులు చెల్లించి నన్ను వైభవంగా చూస్తున్నారని పిల్లపాపలనుకాపాడుకునేందుకు ఎల్లవేళలా అండగా ఉంటానని బంగారు మైసమ్మ దేవాలయం వద్ద సోమవారం నిర్వహించిన రంగం కార్యక్రమంలో భవిష్యవాణి చెప్పాడు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మాజీ కార్పొరేటర్,కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు పోగుల నరసింహ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్,సీనియర్ నాయకులు,ఆలయ కమిటీ అధ్యక్షుడు బొబ్బల లక్ష్మారెడ్డి,నాయకులు దేవరకొండ వీరాచారి,బొమ్మకు రమేష్,మాజీ కార్పొరేటర్లు, ఆలయ కమిటి ప్రతినిధులు,కార్పొరేషన పరిధిలోని వివిధ కాలనీల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వ్యవసాయ పరికరాల సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి

- ముత్యాల నాగరాజు

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: వ్యవసాయ పరికరాలపై ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని చౌటుప్పల్ మండలం వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు సోమవారం ప్రకటనలో తెలిపారు. 12 పవర్ స్ప్రేయర్, 77 బ్యాటరీ స్ప్రేయర్ , 1 ఎరువులు వేసే యంత్రాలు, 4 రోటావే టర్స్, 4ట్రాక్టర్ తో నడిచే డిస్కహారో, కల్టివేటర్, కేజీ వీల్స్,1బండ్ ఫార్మర్, 1బ్రష్ కట్టర్, 1గడ్డి కట్టేయంత్రం, 1పవర్ టిల్లర్, తదితర యంత్ర పరికరాలు రైతులకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. కావలసిన రైతులు తమ భూమి పట్టాదారు పాస్ బుక్కు, ఆధార్ కార్డు జీరాక్సు కాఫీలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ట్రాక్టర్ పరికరాలు కావలసిన రైతులు ట్రాక్టర్ ఆర్సీ, ఒక ఫోటోతో ఈ నెల 5వ తేదీ నుంచి 14వ తేదీ వరకు స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 50శాతం, బిసి రైతులకు 40శాతం సబ్సిడీపై లభించనున్నట్లు తెలిపారు.

## ఈ నెల 7న జోగిపేట మహిళా పాలిటేక్నిక్‌లో స్పాట్ ఆడ్మీషన్‌లు...

– వివరాలు వెల్లడించిన కళాశాల ప్రిన్సిపాల్ వాణి...



అందోలు, ప్రజాస్ఫూర్తి: జోగిపేటలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థినీలకు స్పాట్ ఆడ్మిషన్‌ల కోరకు ధరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ వాణి తెలిపారు. సోమవారం ఆమె పత్రిక ప్రకటనను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాలలోని సీఎస్‌ఈ, ఈసీఈ కోర్సులకు సంబంధించిన గ్రూపులలో అడ్మిషన్‌లను పొందేందుకు ఈ నెల 5, 6వ తేదీలలో విద్యార్థినీలు దరఖాస్తు చేసుకొవాలని ఆమె సూచించారు. దరఖాస్తులను మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో అందజేయాలని ఆమె తెలిపారు. విద్యార్థినీల ఉత్తీర్ణత గ్రేడ్ శాతం, రిజర్వేషన్‌ల ప్రకారం ఆయా గ్రూపుల్లో చేర్చుకుంటామని ఆమె అన్నారు. ఈ నెల 7వ తేదీన కళాశాల ప్రాంగణంలో స్పాట్ ఆడ్మిషన్‌ల ప్రక్రియ ఉంటుందని, విద్యార్థినీలు తమ సర్టిఫికేట్‌లను వెంట తెచ్చుకొవాలని ఆమె సూచించారు.

## నేడు బి.ఆర్.ఎస్.పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం

జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బి.ఆర్.ఎస్.పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం ఉదయం 11.00 గంటలకు గండిమైసమ్మలోని జిల్లా పార్టీ కార్యాలయంలో జరుగుతుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఎమెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అధ్యక్షతన జరిగే పార్టీ ముఖ్య సమావేశానికి నియోజకవర్గ బిఆర్ఆర్ పార్టీ ప్రతినిధులు, మాజీ ప్రతినిధులు, కార్పొరేషన్, మున్సిపల్, డివిజన్ అధ్యక్షులు, సభ్యులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళా నాయకురాళ్ళు పెద్ద ఎత్తున హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.



## అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేయాలి

* శేరిలింగంపల్లి ఎమ్మెల్యే , పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : పనులను వీలైనంత త్వరగా నాణ్యతతో పూర్తిచేసి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వాటిని అందుబాటులోకి తేవాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే , పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ అన్నారు. వివేకానంద నగర్ డివిజన్ లో జిహెచ్ఎంసి ద్వారా మంజూరైన 1 కోటి 49 లక్షల రూపాయలతో పలు అభివృద్ధి పనులకు స్థానిక శాసన సభ్యులు అరికెపూడి గాంధీ తో పాటు కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు లు పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ. 46.20 లక్షలతో వివేకానంద నగర్ కాలనీలో సిమెంటు రోడ్లకు, రూ.19 లక్షలతో వినాయక పార్కు నందు ఓపెన్ జిమ్, రూ.44. 80 లక్షలతో కమల ప్రసన్న నగర్ కాలనీ , ఆల్విన్ కాలనీ ఫేస్ వన్ లలో త్రీ టెంపుల్స్ నందు సిమెంటు రోడ్డు పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. రూ. 20 లక్షలతో పైప్ లైన్ రోడ్ హెచ్పీ పెట్రోల్ బంక్ నుండి ఆల్విన్ కాలనీ రోడ్లో బీటి రోడ్ మరమత్తు , రూ.19 లక్షలతో ఏ ఎస్ రాజు నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్ నందు ఓపెన్ జిమ్ ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమములో బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు గొట్టిముక్కుల పెద్ద భాస్కర్ రావు,ఎర్రబెల్లి సతీష్ రావు,వివేకానందనగర్ కాలనీ అధ్యక్షులు వద్దేపల్లి రాజేశ్వరరావు సొసైటీ మెంబర్లు ,ఎస్ రాజు నగర్ అధ్యక్షులు నర్సింహారావు ,సొసైటీ మెంబర్లు,కమలప్రసన్ననగర్ అధ్యక్షులు శేఖర్ ,సొసైటీ మెంబర్స్ ,అల్విన్ కాలనీ ఫేస్ 1అధ్యక్షులు వెంకటేశగౌడ్,సొసైటీ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

* మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మిక్కిలినేని మను చౌదరి



మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం ఉండకూడదని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మిక్కిలినేని మను చౌదరి అధికారులకు సూచించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియలతో కలిసి కలెక్టరు (91) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అన్నారు. ప్రజావాణిలో స్వీకరించిన ధరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తాడ్మన్నూర్ కార్యదర్శి పై కలెక్టర్ కు ఫిర్యాదు



అందోలు, ప్రజాస్ఫూర్తి: తమ పట్టా భూమిలో అక్రమంగా రేకుల షెడ్డు వేసుకొని తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, గ్రామ కార్యదర్శికి పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని, అతనిపైన తగు చర్యలు తీసుకొని న్యాయం చేయాలని అందోల్ మండలం తాడు మన్నూరు గ్రామ మాజీ సర్పంచ్ బోయిని లక్ష్మీ నర్సింహులు అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో గ్రామ కార్యదర్శి పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో తమకు 2.33 ఎకరాల పట్టా భూమి ఉందని ఆమె తెలిపారు. తమ భూమిలో అక్రమంగా ఇతర ప్రాంతానికి చెందిన భీమ్ రావు అలియాస్ రాజు అనే వ్యక్తి రేకుల షెడ్డు వేసుకున్నాడని ఆమె తెలిపారు. రేకుల షెడ్డు ను తొలగించాలని తాము సూచించిన పట్టించుకోకపోవడంతో అందోల్ మండల ఎంపీడీవో, ఎంపిఓ, గ్రామ కార్యదర్శులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన వారు పట్టించుకోలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై గత ఏప్రిల్ 25వ తేదీన సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్లో లో ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. ఎంపీఓ సోమనారాయణ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామ కార్యదర్శి పవన్ కుమార్ కు ఆదేశాలు జారీ చేశారని ఆమె తెలిపారు. భీమ్ రావు కు ఇప్పటివరకు 3 నోటీసులు జారీ చేశారు తప్ప షెడ్డు తొలగించ లదని ఆమె వాపోయారు. మళ్లీ మండల కార్యాలయంలో సంప్రదించడంతో ఎం పి ఓ సోమనారాయణ జూలై 19న గ్రామ కార్యదర్శికి చర్యలు తీసుకోవాలని సూచించిన కార్యదర్శి ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆమె తెలిపారు. కార్యదర్శి ఉద్దేశపూర్వకంగానే చర్యలు తీసుకోవడం లేదని వారు ఆరోపించారు. దీంతో రెండవసారి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని ఆమె కోరారు.

## చౌటుప్పల్ క్లాత్ అండ్ రెడీమేడ్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ క్లాత్ అండ్ రెడీమేడ్ అసోసియేషన్ నూతన కమిటీని మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా చంద్రయ్య అధ్యక్షతన నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షునిగా కర్నాటి శ్యాంప్రసాద్, కార్యదర్శిగా సుంకి గణేష్, కోశాధికారిగా మసరం యాదగిరి, ఉపాధ్యక్షులుగా పులిపాటి చిరంజీవి, సహాయ కార్యదర్శిగా పున్న రామకృష్ణ, గౌరవ సభ్యులుగా బాష్పాల జగదీష్, గంజి రవి, రావుల ముత్యాలు, గౌరవ సలహాదారులుగా గోశిక స్వామి, తడక నరసింహ, పున్న సత్యనారాయణ, పిల్లల మరి అశోక్, జిల్లా బిక్షం, ఏకగ్రీవంగా ఎన్నుకయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షుడు కర్నాటి శ్యాంప్రసాద్ మాట్లాడుతూ చౌటుప్పల్ లో కరోనా తర్వాత వ్యాపారంలో సమతుల్యత లోపించి చిరు వ్యాపారులు వ్యాపారం చేయలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత, క్లాత్ అండ్ రెడీమేడ్ వస్త్రాలపై ప్రభుత్వం ఇప్పటికైనా ఆలోచించి జీఎస్టీని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. చౌటుప్పల్ లోని వస్త్ర వ్యాపారుడు ఎదురుకుంటున్న సమస్యలపై అడగడానికి ముందుంటానన్నారు. వస్త్ర వ్యాపారులు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, అధ్యక్షునిగా నియమించిన తోటి వస్త్ర వ్యాపారులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో వస్త్ర వ్యాపారులు లగ్గోని శ్రీనివాస్, ఉప్పల లింగస్వామి, గోశిక కరుణాకర్, గోశిక పాండు, దేవులపల్లి గణేష్, జిల్లా శంకర్, పుట్ట బత్తిని రవి, లోక విష్ణు, దొంత మల్లేష్, ఇమ్మడి కిషోర్, ములుగు లక్ష్మయ్య, ఉబ్బు బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు యాన్యువల్ ఇన్స్పెక్షన్

* జిల్లా ఆర్మడ్ రిజర్వు విభాగంలోని అన్ని కార్యాలయాలను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సోమవారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు యాన్యువల్ ఇన్స్పెక్షన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.ముందుగా జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ కు చేరుకున్న ఎస్పీ జిల్లా ఆర్మడ్ రిజర్వు పోలీసుల చేత గౌరవ వందనాన్ని స్వీకరించారు.అనంతరం అక్కడ విధులు నిర్వర్తించే అధికారులు , సిబ్బంది యొక్క ప్రభుత్వ కిట్ ఆర్టికల్స్ ను తనిఖీ చేశారు.తరువాత అడ్మిన్ ఆర్ఐ కార్యాలయం,మోటార్ ట్రాన్స్పోర్ట్ కార్యాలయం,వెల్ఫేర్ కార్యాలయం, ఆర్ఐ హోంగార్డ్స్ ఆఫీసులలో రికార్డులను తనిఖీ చేశారు.బాంబు డిస్పోజల్ టీం,డాగ్ స్క్వాడ్ బృందాలను పరిశీలించి ఇంచార్జ్ అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో పనిచేసే అధికారులు, సిబ్బంది క్రమశిక్షణతో,నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు.ఎప్పటికప్పుడు పోలీస్ శాఖలో వినియోగించే సాంకేతికతను,శిక్షణను నేర్చుకుంటూ ప్రజలకు సేవలు అందించడంలో ముందుండాలని తెలిపారు. పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ శారీరక దృఢత్వంతో పాటు మానసికంగా కూడా దృఢంగా ఉండాలని,అందుకుగాను ప్రతిరోజూ వ్యాయామంతో పాటు యోగా,ధ్యానం వంటి వాటిని అలవాటు చేసుకోవాలని సూచించారు.ప్రతి ఒక్కరూ తమకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు.అనంతరం అధికారులు, సిబ్బంది యొక్క సమస్యలు తెలుసుకున్నారు.ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ,ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎంటి ఓ సుధాకర్, ఆర్ఐ హోమ్ గార్డ్స్ నరసింహారావు,ఆర్ఐ అడ్మిన్ లాల్ బాబు,ఆర్ఐ వెల్ఫేర్ కృష్ణారావు , ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల నాణ్యతాలోపం, జాప్యాన్ని సహించబోను

* **కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలు జాతరను తలపించాయి. మూడు మండలాల పరిధిలో ఎన్ఆర్ఈజిఎస్, సిఆర్ఆర్, ఎస్సిపి, డిఎంఎఫ్టి, వివిధ సంస్థల సిఎస్ఆర్ నిధులు రూ.665.31కోట్లు మంజూరు కాగా ఈ నిధులతో పూర్తయిన పనులకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సోమవారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించారు. కొత్తగూడెం పట్టణంలో జెన్కో సిఆర్ఆర్ నిధులు రూ.కోటితో నిర్మించనున్న బిసి బాలికల భవన సముదాయాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభల్లో కూనంనేని మాట్లాడుతూ ఒక్కరోజే 103 పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరిగాయని, లక్ష్మిదేవిపల్లి మండల పరిధిలోని సాటివారిగూడెం, చాతకొండ, హమాలీ కాలనీ, సంజయ్ నగర్, అశోక్ నగర్ పంచాయతీల్లో రూ.414.5కోట్లు, చుంచుపల్లి మండలంలో రూ.64లక్షలు, సుజాతనగర్ మండలంలో రూ.87.37లక్షలతో సిసి రోడ్లు, డ్రైన్లు, కమ్యూనిటీ హాళ్లు, ప్రభుత్వ భవనాలు, వాటర్ ట్యాంకుల ప్రారంభోత్సావాలు, శంకుస్థాపనలు చేశామని తెలిపారు. రాష్ట్రంలోనే కొత్తగూడెం నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపేందుకు తపిస్తున్నాని, ప్రజలకు మౌలిక వసతులు కల్పించేవరకు విశ్రమించబోనని స్పష్టం చేశారు. గ్రామాలు, బస్తీల్లో అభివృద్ధి నిధుల కేటాయింపులో ఎలాంటి వ్యత్యాసం ఉండబోదని, ప్రాధాన్యతా క్రమంలో నిధులు కేటాయించి అభివృద్ధి చేపడుతున్నామన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపం, జాప్యాన్ని సహించబోనని, దీనికి అధికారులే బాధ్యత వహించాలన్నారు. పనులు నాణ్యతతో, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని, పూర్తయిన పనుల నిర్వహణ బాధ్యత మున్సిపల్, గ్రామపంచాయతి, ఇతర ప్రభుత్వ శాఖలదేనన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, గ్రంథాలయ చైర్మన్ వీరబాబు, సొసైటీ చైర్మన్ హన్మంతరావు, కార్పొరేషన్ కమిషనర్ సుజాత, ఈఈ వెంకటేశ్వర్ రావు, బిసి వెల్ఫేర్ ఆఫీసర్ ఇందిర, పంచాయతిరాజ్ డిఈ రామకృష్ణ, ఏఈ శివలాల్, మిషన్ భగీరథ అధికారులు, విద్యుత్ శాఖా, ఐటిసిఏ అధికారులు, వ్యవసాయ శాఖ, నాయకులు చంద్రగిరి శ్రీనివాస్, సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, యూసుఫ్, ధర్మరాజు, బోయిన విజయ్, సత్యనారాయణాచారి, నేరెళ్ల రమేష్, నేరెళ్ల శ్రీనివాస్, జగన్, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, మిర్యాల రాము తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి

* **మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్ రెడ్డి**



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్ రెడ్డి అన్నారు. సుభాష్ నగర్ డివిజన్ పరిధిలో లోని సూరారం కాలనీ, కృషి కాలనీ, పూష్పా గిరి, బస్తీ సాయి బాబా నగర్, పాండు బస్తీ, శివాహిల్స్, శివాలయనగర్, అల్లూరి సీత రామ రాజు నగర్,విడిఆర్ కాలనీ , తదితర బస్తిలలో తాగు నీరు పది రోజులకోసారి రావడంతో స్థానికులు ఇబ్బందులు పడటం చూసి సోమవారం స్థానికులతో కలిసి జీఎం కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు.అనంతరం వాటర్ వర్క్స్ జిఎం మాధవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రెండు రోజులకొకసారి మంజీరా నీళ్లు వదలకపోతే కుత్బుల్లాపూర్ ప్రజలతో కలిసి ఖైరతాబాద్ లోని జలమండలి ఎండి. కార్యాలయం ముందు కూర్చుంటామన్నారు. ప్రజలకు ఇబ్బందులు పెడితే ఊరుకునేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ, మహిళా అధ్యక్షురాలు మంగ, మహిళా నాయకురాలు అనిత, సూరారం కాలని నాయకులు తార సింగ్, సంతోష్ నగర్ అధ్యక్షులు కిషన్ చారి, కృషి కాలని అధ్యక్షులు సత్యనారాయణ గౌడ్, జీఎస్. కిషోర్, రాజు గౌడ్,ప్రభాకర్,మీన్ కుమార్, సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని ప్రియాంక నగర్, పుష్ప గిరి బస్తీ, పాండు బస్తీ తదితర బస్తిల నాయకులు పాల్గొన్నారు.

## ధరల కట్టడిపై చర్యలు తీసుకోవాలి

- **అధికారులను ఆదేశించిన కలెక్టర్**
- **ఎస్ లింగోటం లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనుల పరిశీలన**
- **యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సంబంధించిన సిమెంటు, ఇటుక, స్టీల్ ధరలను కట్టడి చేసేందుకు ప్రభుత్వం వైపు నుంచి అధికారులు చర్యలు తీసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఎస్ లింగోటం గ్రామాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. నిర్మాణం అవుతున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి కావలసిన సిమెంటు, ఇటుక, స్టీల్, ఇసుక ధరలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి, ఎంపీడీవో సందీప్ కుమార్, ఎంపీవో అంజిరెడ్డి, హౌసింగ్ డీఈ నాగేశ్వర రావు, ఏఈ రజియుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ప్రభావిత ప్రాంత ప్రజల సమస్యలను పరిష్కరించాలి

* **ఇల్లందు నియోజకవర్గం శాసన సభ్యులు కోరం కనకయ్య**



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు :తెలంగాణ రాష్టం సింగరేణి సిఎండి బలరాం నాయక్ ను సోమవారం ఇల్లందు నియోజకవర్గం శాసన సభ్యులు కోరం కనకయ్య హైదరబాద్ సింగరేణి భవన్ నందు మర్యాద పూర్వకంగా కలిసి ఇల్లందు ప్రాతంలో ఉన్న సింగరేణి ప్రభావిత ప్రాంత ప్రజల సమస్యల గురించి వివరించారు. వారి వెంట ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు. వారితో పాటు కామేపల్లి మండలం సొసైటి చైర్మెన్ గుజ్జర్లపుడి హనుమంతరావు,కంట్రాక్టర్ రాము తదితరులున్నారు.



## మణుగూరులో నూతన బ్లడ్ బ్యాంక్ ప్రారంభం...

* **రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచిన జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్..**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: మణుగూరులోని వంద పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నూతన ఏర్పాటుచేసిన రక్త నిల్వ కేంద్రం సోమవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, రిబ్బన్ కటింగ్ చేసి, బ్లడ్ బ్యాంక్ లో ఏర్పాట్లను పరిశీలించారు . రక్త నిల్వ కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం కలెక్టర్ స్వయంగా రక్తదానం చేసి ప్రజలకు రక్తదానంపై అవగాహన కల్పిస్తూ ఆదర్శంగా నిలిచారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ “రక్తదానం అంటే ప్రాణదానం, మనం ఇచ్చే ఒక్క యూనిట్ రక్తం ఇతరరికి జీవం పోసే వరంగా మారుతుంది. గర్భిణీలు, తలసీమియా, సికిల్ సెల్, అనీమియా వంటి వ్యాధులతో బాధపడేవారు, ప్రమాదాల వల్ల గాయపడిన వారు రక్తానికి ముఖ్యంగా ఆధారపడుతారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ సంవత్సరంలో కనీసం రెండు సార్లు రక్తదానం చేయాలిఅని పిలుపునిచ్చారు.రక్తదానం చేయడం ద్వారా రక్తహీనతతో బాధపడే గర్భిణీలు, తల సేమియా, సికిల్ సెల్, అనీమియా, వంటి రోగులకు , ప్రమాదాల్లో గాయపడిన వారికి ఈ రక్తం ప్రాణ రక్షణగా మారుతుంది అన్నారు. మణుగూరులో ఈ రక్త నిల్వ కేంద్రం ఏర్పాటు కావడం ద్వారా, అత్యవసర పరిస్థితులలో పేషెంట్లకు రక్తాన్ని సమీపంలోనే అందుబాటులోకి తేవచ్చు. ఇప్పటి వరకు రక్త అవసరాల కోసం ఖమ్మం, భద్రాచలం తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇకపై అది అవసరం లేదని కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఇచ్చిన స్ఫూర్తితో డి సి హెచ్ ఎస్ డాక్టర్ రవిబాబు, ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ సునీల్ మరియు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ముందుకు వచ్చి రక్తదానం చేశారు. సందర్భంగా 20 మంది రక్తదానం చేశారు. నూతనంగా ప్రారంభించిన రక్తనిల్వ కేంద్రానికి సరిపడా రక్త నిల్వల కోసం ఈ రక్తాన్ని ఉపయోగిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషలిస్ట్ వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్యాన్ని మెరుగుపరచాలి...

* **సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి**
  **సిపిఐ వినతి**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కార్పొరేషన్ పట్టణ పరిధిలోని అన్ని డివిజన్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా యుద్ధ ప్రాతిపదికన పారిశుద్ధ్య పనులు చేపట్టి పారిశుధ్యన్నే మెరుగుపరచాలని సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కమిషనర్ సుజాతకి పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో పలు సమస్యలపై వినోద్ పత్రం అందించిన సిపిఐ పట్టణ కార్యదర్శి కంచర్ల జములయ్య మాట్లాడుతూ ప్రజలు ఈ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నారని, అద్వాన్నంగా ఉన్న పారిశుధ్యం మెరుగుపరిచి అన్ని డివిజన్లో దోమమందును, దోమల పొగను పిచికారి చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లాలని తెలిపారు. అలాగే వీధి దీపాలు సమస్య ఉన్నదని తక్షణమే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని అన్నారు. అన్ని డివిజన్లో కుక్కలు, కోతుల సమస్య చెప్పలేని స్థితిలో ఉన్నాయని ఈ సమస్యపై వాటి నివారణ కోసం చర్యలు తీసుకోవాలని వివరించారు. అలాగే ఆగిపోయిన చెత్త వాహనాలు అన్నింటిని రిపేర్ చేయించి వాటిని ఉపయోగంలోకి తీసుకురావాలని కోరారు. అలాగే భగీరథ పైప్లైన్ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో కాలువలు కూలిపోయి కాలువల్లో నీళ్లు ఆగి మునిగిపోయి అద్వాన్నంగా ఉన్నాయని తక్షణమే కాలువలను పునరుద్ధరించి ఆయా ప్రాంతాల్లో పరిశుద్ధాత్మ మెరుగుపరచాలని కమిషనర్ కి విజ్ఞప్తి చేశారు. వినోద్ పత్రం అందించిన వారిలో కొత్తగూడెం సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శులు మునిగడప వెంకటేశ్వర్లు, పిడుగు శ్రీనివాస్, మాచర్ల శ్రీనివాస్, వన్ టౌన్ సహాయ కార దర్శి కోలాపూర్ ధర్మరాజు ,3 టౌన్ సిపిఐ కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్ ,సహాయ కార్యదర్శులు సత్యనారాయణ చారి, బోయిన విజయ్ కుమార్, నాయకులు అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేలా కృషి



కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేలా కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 33వ , 31 వ డివిజన్లలో సీసీ రోడ్ పూర్తిగా పాడువటంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బంది అవుతుండడంతో కాలనీ వాసులు నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని గత నెల సంప్రదించగా వారి సమస్యపై స్పందించి కార్పొరేషన్ ఫండ్స్ ద్వారా సిసి రోడ్ నిర్మాణానికి మంజూరు చేయించి శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి , సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి లు హజరయ్యారు. అనంతరం కాలనీ వాసులు శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంసీ జనరల్ సెక్రటరీ కొలన్ జీవన్ రెడ్డి, బీసీ ఉపాధ్యక్షులు లక్ష్మణ్, 33 వ డివిజన్ అధ్యక్షులు పి ప్రభాకర్ రెడ్డి, బాలకృష్ణ, 31 వ డివిజన్ అధ్యక్షులు పితాని శ్రీనివాసరావు, నరసింహారావు, రాంచందర్ నాయక్, దాల్ నాయుడు, ఆటో శ్రీను, గౌస్ బాయ్, భుజంగ రెడ్డి, రాయుడు, వెంకట్ రెడ్డి, సరితా రెడ్డి., రాధా జ్యోతి, ధనలక్ష్మి, నవ్య బేకరీ, సత్యవతి, చిరంజీవి ,ఈశ్వర్, రాజు , సీనియర్ కాంగ్రెస్ నాయకులు కాలనీ వాసులు పాల్గొన్నారు

## శ్రీ ఉమా సహిత విశ్వేశ్వర స్వామి ఆలయంలో మహాకాళ్ రూపంలో భక్తులకు దర్శనం



ప్రజాస్ఫూర్తి ఇల్లందు :శ్రావణ సోమవారం సందర్భంగా పట్టణంలోని శివాలయాలు ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా పట్టణంలోని 13వ వార్డు ఆరెందర్ కాలనీలో ఉన్నటువంటి శ్రీ ఉమాసహిత విశ్వేశ్వర స్వామి ఆలయం లో కొలువుదీరిన స్వామి వారికి సోమవారం ఉజ్జయిన్ మహాకాళ్ రూపంలో అలంకరణ చేసి కాలనీ భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సునీల్ శంక్వార్ మాట్లాడుతూ ప్రతి శ్రావణ మాసం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి ప్రత్యేక రూపంలో దర్శనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజేందర్ శంక్వార్,కిరణ్ కుమార్ శంక్వార్, ఈశ్వర్ శంక్వార్, విష్ణు శంక్వార్, తదితరులు పాల్గొన్నారు.

## మత్తు సేవిస్తున్న వ్యక్తి రిమాండ్



మేడిపల్లి ప్రజాస్ఫూర్తి:మేడిపల్లి పోలీసులు విసిబుల్ పోలీస్ లో భాగంగా ఫుడ్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఒక వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో అట్టి వ్యక్తిని తనిఖీ చేయగా అతని దగ్గర 80 గ్రాముల పాపి స్ట్రా పౌడర్ లభించినది. అట్టి వ్యక్తిని విచారించగా అతని పేరు కమల్ కిషోర్ వయసు 22 సంవత్సరాలు సొంత ఊరు రాజస్థాన్ నుండి వచ్చి చెంగిచెర్ల లో నివాసం ఉంటూ గ్యాస్ డెలివరీ బాయ్ గా పనిచేస్తున్నాడు. పని భారం ఎక్కువగా ఉండడంతో తాను మత్తుకి బానిస గా మారాను అని ఒప్పుకున్నాడు. అది సేవించడం వలన నిద్ర బాగా వస్తుందని తెలిపినాడు. ఇటీవల కాలంలో సొంత రాష్ట్రమైన రాజస్థాన్ కు వెళ్లి అక్కడ తెలిసిన వ్యక్తుల ద్వారా కొంత మొత్తం పాపిష్ట్ర పౌడర్ ను ఖరీదు చేసుకొని తిరిగి హైదరాబాదుకు వచ్చినాడు అవసరం ఉన్నప్పుడు దాని సేవిస్తూ తాను రిలీఫ్ పొందుతున్నాడు అని ఒప్పుకున్నాడు. ప్రతి వ్యక్తిపై మేడిపల్లి పోలీస్ వారు. Ndps కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించడం జరిగినది. మత్తు జీవితాన్ని నాశనం చేస్తుంది మేడిపల్లి ఇన్స్పెక్టర్ గోవిందరెడ్డి మత్తు జీవితాన్ని అంధకారం చేస్తుంది, యువత మత్తు వదిలి తమ జీవితం వైపు దృష్టి పెట్టాలని కోరారు... తల్లిదండ్రులు కూడా పిల్లలపైన ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు.

## క్రమంగా బడులు సందర్శనలో ఎంఈఓ



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ ప్రభు దయాల్ ప్రతిరోజు క్రమంగా పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తూ, తనదైన శైలిలో అకాడమిక్ రంగాభివృద్ధికై కృషి చేస్తున్నారు. సోమవారం చిట్టి రామవరం తండా ప్రభుత్వ పాఠశాల, నేతాజీ రామవరం ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం సిద్ధం చేసే విధానాలు, విద్యార్థుల హాజరు, పాఠశాల పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు.విద్యార్థులకు గుణాత్మక విద్య అందించేందుకు సాధ్యమైన అన్ని రీతుల్లో కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులే మనకు నిజమైన వీఐపీలు; వారు ఉన్నతమైన వ్యక్తిత్వాలను పొందేలా మనం కృషి చేయాలి అని డాక్టర్ ప్రభు దయాల్ అన్నారు.

# 45 కేజీల గంజాయి పట్టివేత.. ముగ్గురు రిమాండ్

ప్రజాస్ఫూర్తి ఇల్లందు: నిషేదిత గంజాయిని విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఇల్లందు పోలీసులు అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఇల్లందు పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి తన సిబ్బందితో కలిసి బొజ్జాయిగూడెం పంచాయతీ ఆఫీస్ దగ్గర నమ్మదగిన సమాచారం పై వాహనాలు తనిఖీ చేస్తుండగా, కొత్తగూడెం వైపు నుండి ఇల్లందు వైపుకు ఒక మహీంద్రా ఎక్స్యువి 300కారు (టీఎస్ 12ఈకె 3236) వెళ్తుండగా ఆపి తనిఖీ చేయగా కారు లో ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకొని కార్ తనిఖీ చేయగ కార్ లో నిషేధిత గంజాయి లభించింది. ఇట్టి గంజాయిని మహారాష్ట్ర రాష్ట్రం, జాల్నా జిల్లా, మహాకాల్ కు చెందిన హరిబాబు



అలీయాస్ హరిఓం ఆదేశాల మేరకు ఒడెస్సా, అలూరికోట కు చెందినా రాము, తాతారావు వద్ద నుండి మహాకాల్, జాల్నా జిల్లా, మహారాష్ట్ర రాష్ట్రం కు భద్రాచలం, ఇల్లందు మీదగా తరలిస్తుండగా ఇల్లందు మండలం బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ ఆఫీస్ దగ్గర పట్టుకొని వారి వద్ద నుండి 22,62,800/ రూపాయల విలువ చేసే 45.256 కేజీల గంజాయి, 3 మొబైల్ మహీంద్ర ఎక్స్యువి 300 కారు లను వారి వద్ద నుండి స్వాదినపరచుకోని, పోలీస్ స్టేషన్ కు వచ్చి సీఐ టీ.సురేష్, కు అప్పజెప్పడం జరిగింది, ఈ మేరకు కేసు నమోదు చేసుకుని కోటియా తాండా తానంచర్ల చెందిన తేజవత్ శంకర్ , కోటియా తండా, తనంచెర్ల కు చెందిన తేజవత్ జంకు , సూర్యాపేట జిల్లాకు చెందిన ఆంగోతు సంతులను అరెస్టు కాగా ముగ్గురు ముద్దాయిలను రిమాండ్ నిమితం పంపనైనది. పరారీలో ఉన్నారాము , తాతరావు , హరిబాబు @ హరి ఓమ్ త్వరలో పట్టుకుంటామన్నారు. వారి వద్ద నుంచి రూ.22,62,800, వాల్యూ 45.256 కీలోల గంజాయి , 3 మొబైల్స్ , మహీంద్రా ఎక్స్యువి 300 కార్ ను స్వాధీనం చేసుకున్నారు.

## సౌత్ ఇండియా కుంగ్ ఫూ కరాటే పోటీలో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఖమ్మంలో జరిగిన సౌత్ ఇండియా కుంగ్ ఫూ కరాటే ఛాంపియన్షిప్ పోటీలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కు చెందిన కుంగ్ ఫూ మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారులు పలు విభాగాలలో జరిగిన పోటీలలో సత్తా చాటి పతకాలు గెలుపొందారు. అండర్ 17, బాలుర కటాస్ విభాగంలో కే.లిఖిత్ చరణ్ బంగారు పతకం,అండర్ 10, బాలుర విభాగంలో బి.భాను కృష్ణ కటాస్ విభాగంలోవెండి పతకం గెలుపొందారు.బాలికల విభాగంలో అండర్ 8, ఎస్ షణ్ముఖ శ్రీ అండర్ 10, సిహెచ్ సాత్విక అండర్ 12,వి.శరణ్య, వీరు ముగ్గురు బాలికలు కటాస్ విభాగంలో జరిగిన పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచి కాంస్య పతకాలు గెలుపొందారు. మార్షల్ ఆర్ట్ శిక్షకురాలు పెదపాటి నిహారిక వద్ద శిక్షణ పొందుతున్న వీరు గతంలో కూడా పలు రాష్ట్ర ,జాతీయ స్థాయి, కుంగ్ ఫూ కరాటే పోటీలలో అనేక పతకాలు బహుమతులు గెలుపొందారు. పతకాలు గెలుపొందిన క్రీడాకారులను కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు నాగ సీతారాములు ప్రధాన కార్యదర్శి పి.కాశీ హుస్సేన్ జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.కె షబ్బీర్ పాషా, జిల్లా కుంగ్ ఫూ మాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఐ .ఆదినారాయణ, కార్యనిర్వహక అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు రాజా ,సుబ్రహ్మణ్యం, మల్లికార్జున్, కోచ్ లు పలువురు సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.



## లోతట్టు ప్రాంతాల పై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

*** ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**

శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : . వర్షాలను దృష్టిలో పెట్టుకొని లోతట్టు ప్రాంతాల పై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. సోమవారం కురిసిన భారీ వర్షానికి ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో ఉషముళ్ళపూడి ప్రధాన రహదారిలో వరదనీరు రోడ్డు మీద ప్రవహించడంతో వాహనదారులకు ఇబ్బంది అవుతుందన్న విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హుటాహుటిన అక్కడకు చేరుకుని జి.ఎచ్.ఎం.సి , మన్సూన్ సిబ్బందికి సమాచారం అందించి వెంటనే వరదనీటిని క్లియర్ చేసి ట్రాఫిక్ నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రదానరహదారి కావడంతో వాహనదారులకు ఇబ్బంది కలగకుండా, ట్రాఫిక్ నిలిచిపోకుండా వరదనీటిని క్లియర్ చేయడం జరుగుతుందని అన్నారు. అకాల వర్షాలతోఎటువంటి



ఇబ్బందులు కలిగిన,(ఎలక్ట్రికల్, రోడ్డు, డ్రైనేజీ, మంచి నీటి) వంటి సమస్య లు ఎదురైన, వెంటనే సంబంధిత అధికారులకు గాని, మాకు గాని, మా కార్యాలయంకు గాని సంప్రదించాలని తెలియచేసారు. వర్షాలను దృష్టిలో పెట్టుకొని జీహెచ్ఎంసీ అధికారులు , మాన్ సున్ ఎమర్జెన్సీ టీమ్స్ , డిజాస్టర్ మేనేజ్మెంట్ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎటువంటి ఇబ్బంది లేకుండ చూడలని తెలియచేసారు.

## హైస్కూల్ స్థలంలో నిర్మించిన షాపుల కిరాయినిహై స్కూల్ కి ఇవ్వాలి



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: ఇల్లందు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (మెయిన్ రోడ్ హై స్కూల్) స్థలంలో నిర్మించిన షాపుల కిరాయిని పాఠశాలకి ఇవ్వాలని, అదేవిధంగా షాపుల నిర్మాణ ప్రారంభంలో ఇల్లందు మున్సిపల్ అధికారులు , నాటి చైర్మన్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతూ సోమవారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యూ) ఆధ్వర్యంలో కొత్తగూడెం జిల్లా జాయింట్ కలెక్టర్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పి.డి.ఎస్.యూ ప్రధాన కార్యదర్శి జె గణేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం హరితహారం పేరుతో ప్రభుత్వ పాఠశాల స్థలాలలో మొక్కలు నాటగా, ఇల్లందు పట్టణ నడి ఒడ్డున గల ఎంతో చరిత్ర కల్గిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల (మెయిన్ రోడ్ హై స్కూల్) స్థలాన్ని పట్టణ అభివృద్ధి పేరుతో పాఠశాల స్థలంలో షాపులను నిర్మించారు. షాపుల నిర్మాణ ప్రారంభ దశలో విద్యార్థులు, విద్యార్థి సంఘాలు పాఠశాల స్థలం దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఉందని, పాఠశాల స్థలంలో విద్యాశాఖ కాకుండా ఇతర ఏ శాఖలు కూడా ఎలాంటి నిర్మాణాలు చేపట్టారాదు అని పాఠశాల స్థలాన్ని పాఠశాల కోసమే వినియోగించుకోవాలని వినతులు, ఆందోళనలు చేపట్టడం జరిగింది. ఈకార్యక్రమంలో జిల్లా నాయకుడు వి.విజయ్ డి.అరుణ్ జె.చంటి తదితరులు పాల్గొన్నారు.

## అమేజింగ్..! గిన్నిస్ వరల్డ్ రికార్డులోకి ప్రధాని మోదీ 'పరీక్షా పే చర్చ'!

పరీక్షల సమయంలో విద్యార్థుల్లో భయాందోళన, ఒత్తిడిని పోగొట్టేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించిన 'పరీక్షా పే చర్చ' అరుదైన ఘనత సాధించింది. ఈ కార్యక్రమం గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకుంది. ఈ విషయాన్ని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ 'ఎక్స్' వేదికగా షేర్ చేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఘనత తనకు వ్యక్తిగతంగానూ ఎంతో సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. ఈ ఏడాది నిర్వహించిన 8వ ఎడిషన్ 'పరీక్షా పే చర్చ' కార్యక్రమానికి నెల రోజుల్లోనే దాదాపు 3.53 కోట్ల మందికి పైగా రిజిస్ట్రేషన్లు చేసుకోవడం, 21 కోట్ల మందికి పైగా టీవీల్లో వీక్షించడంతో ఇది ప్రపంచ రికార్డును నెలకొల్పింది. ఈ చిరస్మరణీయ ఘనత సాధించిన వేళ ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులందరికీ అభినందనలు తెలిపారు. ఈ మేరకు దిల్లీలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సిబ్బంది ఈ సర్టిఫికెట్ను అధికారికంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, అశ్వినీ వైష్ణవ్, కేంద్ర సహాయ మంత్రి జితిన్ ప్రసాద, పాఠశాల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. తాను క్యాబినెట్ మంత్రిగా ఉన్న కాలంలో ఇది రెండో గుర్తింపు అని ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. 2015లో కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఎల్పీజీ గ్యాస్ పంపిణీలో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రత్యక్ష నగదు బదిలీ కార్యక్రమంగా




చేపట్టిన 'పహల్' పథకానికి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ నుంచి ప్రధాని నరేంద్ర మోదీ సర్టిఫికెట్ అందుకున్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని పరీక్షా పే చర్చ ఒత్తిడి లేని, ఆనందకరమైన అభ్యాసం కోసం దేశ వ్యాప్తంగా ఓ పండుగలా మారిందన్నారు. పరీక్షల ఒత్తిడి తగ్గించడంతో పాటు వ్యక్తిగత పురోగతిని ప్రోత్సహించేలా ఈ విధానానికి రూపకల్పన చేసిన ప్రధాని మోదీకి హ్యాట్సాఫ్ అన్నారు. అలాగే, విద్యాసంబంధిత ఒత్తిళ్లను తగ్గించడంలో, మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహించి విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఈ కార్యక్రమం చూపే లోతైన ప్రభావాన్ని గుర్తించినందుకు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ విద్యా విధానం 2020 స్ఫూర్తిని అమలులోకి తీసుకొచ్చేలా పరీక్షా పే చర్చ ఏటా మరింత భారీగా, మెరుగ్గా ఉంటుందని ధర్మేంద్ర ప్రధాన్ విశ్వాసం వ్యక్తం చేశారు. మరోవైపు, కేంద్రమంత్రి అశ్వినీవైష్ణవ్ 'అఫిషియల్లీ అమేజింగ్' అంటూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. పీపీసీని తొలిసారిగా 2018 ఫిబ్రవరి 16న దిల్లీలో నిర్వహించగా.. అప్పట్నుంచి ఏటా ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే.

## ప్రభుత్వ స్థలాలను ప్రజాపయోగ కార్యక్రమాలకు ఉపయోగించాలి

*** జిల్లా కలెక్టర్ ను కలిసిన కాంగ్రెస్ నాయకులు**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ప్రభుత్వ స్థలాలను ప్రజాపయోగ కార్యక్రమాలకు ఉపయోగించాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. సోమవారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ ఆధ్వర్యంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ని మర్యాదపూర్వకంగా కలిసి కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ఎండోస్మెంట్ ల్యాండ్స్ , కమ్యూనిటీ హాల్స్, బాచుపల్లి లోని కౌసల్య కాలనీ లో ల్యాండ్ కబ్జా మరియు గాజులరామారం లోని టీఎస్ఐఐసీ ల్యాండ్స్ , దుండిగల్ మున్సిపాలిటీ, బహదూర్ పల్లి, డి. పోచంపల్లి, కైసర్ నగర్, నిజాంపేట్, బాచుపల్లి డబల్ బెడ్ రూమ్స్ లలో అంగన్వాడీ కేంద్రం, బస్తీ దవాఖాన, చౌకదారుల దుకాణాలు , నీటి సమస్య వంటి పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి , మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా గ్రంధాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## చైనాకు ఎందుకు క్లీన్‌చిట్ ఇచ్చారు? కేంద్రానిది 'డీడీఎల్‌జే' పాలసీ: కాంగ్రెస్ విమర్శ

కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. జూన్ 15, 2020న గల్వాన్‌లో మన సైనికులు దేశం కోసం వీరోచితంగా పోరాడి ప్రాణాలను త్యాగం చేసిన తర్వాత మాట్లాడిన ప్రధాని.. మన భూభాగంలోకి ఎవరూ చొరబడలేదని చైనాకు ఎందుకు క్లీన్ చిట్ ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. మన సైనికులు అమరులైనప్పటి నుంచి.. దేశభక్తి కలిగిన ప్రతి భారతీయుడు అనేక ప్రశ్నలు లేవనెత్తినప్పటికీ.. సమాధానాలు ఇవ్వడానికి బదులుగా, మోదీ ప్రభుత్వం గత ఐదేళ్లుగా 'తిరస్కరించు, దృష్టి మరల్చు, అబద్ధం చెప్పు, సమర్థించు' అనే విధానాన్ని అనుసరిస్తూ వస్తోందంటూ ధ్వజమెత్తారు. జవాబుదారీతనం నుంచి తప్పించుకోవడానికి మోదీ ప్రభుత్వం ఎటువంటి పరిస్థితులైనా సృష్టించగదని జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో చైనా పాకిస్థాన్‌కు బహిరంగంగా మద్దతు ప్రకటించినప్పటికీ మోదీ నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు. చైనా మన భూ భాగాన్ని ఆక్రమించిందని రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన కొన్ని గంటల తర్వాత జైరాం



రమేశ్ ఈ వ్యాఖ్యలు చేశారు. 2 వేల కిలోమీటర్ల మేర భారత భూభాగాన్ని చైనా ఆక్రమించుకుందని రాహుల్ చేసిన వ్యాఖ్యలను సోమవారం సుప్రీం కోర్టు తప్పుబట్టింది. చైనా ఆక్రమించిందనే విషయం మీకెలా తెలుసని కాంగ్రెస్ నేతను ప్రశ్నించిన సర్వోన్నత న్యాయస్థానం.. నిజమైన భారతీయులెవరూ అలా మాట్లాడరంటూ వ్యాఖ్యానించింది.

## జీవాలకూ.. నేలకూ బలమే

ఇక్కడ నీటిలో నాచు పేరుకుపోయిందా.. పాకురు పట్టిందా అనే అనుమానాలు కలుగుతున్నాయా? కానీ ఇది అజొల్లాగా పిలిచే త్రిభుజాకార చిన్నమొక్కల సమూహం. కోళ్లు, పశువులు, జీవాలకు అత్యుత్తమ పౌష్టికాహారం. వరి పంటలో అధిక దిగుబడికి సేంద్రియ ఎరువుగా, కలుపు మొక్కల నివారిణిగానూ ఉపయోగపడుతుంది. ప్రస్తుతం దీనికి భారీగా డిమాండు ఉంది. ఎక్కువగా చైనా నుంచి దిగుమతయ్యే అజొల్లాను స్థానికంగా పెంచడంపై రైతుల్లో ఇప్పుడిప్పుడే ఆసక్తి పెరుగుతోంది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో దీని కొనుగోలు, పెంపకం అధికంగా ఉందని వెటర్నరీ విశ్వవిద్యాలయ పశు ఉత్పత్తి, యాజమాన్య విభాగం సీనియర్ ప్రొఫెసర్ ఆర్ఎంవీ.ప్రసాద్ తెలిపారు. ఇందులో 25 నుంచి 30 శాతం వరకు ప్రొటీన్, బీటా కెరోటిన్, విటమిన్ బీ12, కాల్షియం, పొటాషియం, ఫాస్పరస్, మెగ్నీషియం తదితర ఖనిజాలు పుష్కలంగా ఉంటాయని వెల్లడించారు.



## ప్రజావాణిలో 'వ్యాపార' పాఠం



కరీంనగర్ కలెక్టరేట్: కరీంనగర్ జిల్లా సప్తగిరికాలనీ, శంకరపట్నం, చిగురుమామిడి కేజీబీవీ విద్యార్థినులు ప్రత్యేక శిక్షణలో భాగంగా రాఖీల తయారీని నేర్చుకున్నారు. సొంతంగా తయారు చేశారు. ఈ విషయం తెలిసి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచనతో వీరు రాఖీలను జిల్లా కేంద్రంలోని ప్రజావాణి హాల్ వద్ద సోమవారం ప్రదర్శనగా ఉంచారు. ప్రజావాణికి వచ్చిన పలువురు వాటిని కొనుగోలు చేశారు. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టరు అశ్విని తానాజీ వాకడే, డీఈవో చైతన్యజైనీ, బల్దియా కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, గర్ల్స్ ఛైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి కృపారాణి తదితర అధికారులు విద్యార్థినులను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతికి, ఇతర అధికారులకు విద్యార్థినులు రాఖీలు కట్టారు.

# రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పణంగా పెట్టి మేడిగడ్డ వద్ద బ్యారేజ్ కట్టారు: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు కోసం గత పాలకులు అధిక వడ్డీలతో రూ.84వేల కోట్ల అప్పు తెచ్చారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. క్యాబినెట్ భేటీ అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులతో కలిసి మీడియాతో ఆయన మాట్లాడారు. రూ.38వేల కోట్లతో తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు చేపట్టాల్సి ఉండగా.. మేడిగడ్డకు మార్చారని చెప్పారు. భారీగా తెచ్చిన అప్పులతో చేపట్టిన కాళేశ్వరం.. భారత రాష్ట్ర సమితి హయాంలోనే కూలిపోయిందన్నారు. "మేడిగడ్డ బ్యారేజ్‌పై న్యాయ విచారణ చేయిస్తామని గతంలోనే హామీ ఇచ్చాం. అధికారంలోకి వచ్చాక జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో న్యాయ విచారణ చేపట్టాం. రాజకీయ అంశాలు జోడించకుండా విచారణ జరపాలని కోరాం. 660 పేజీలతో నివేదికను కమిషన్ నీటిపారుదల శాఖకు ఇచ్చింది. నివేదికను ముగ్గురు అధికారుల కమిటీ 25 పేజీలతో సంక్షిప్తం చేసింది. 2016లో మేడిగడ్డ ప్రాజెక్టు అగ్రిమెంట్ జరిగింది. 2019లో కాళేశ్వరం ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. 2023లో మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయింది. బ్యారేజ్ కుంగుబాటుపై ఎన్‌డీఎస్‌ఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ) నివేదిక ఇచ్చింది. మేడిగడ్డ నిర్మాణంలో ప్లానింగ్, డిజైన్‌లో లోపాలున్నాయని తేలింది. మేడిగడ్డతోపాటు అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులోనూ ఇదే సమస్య ఉందని కమిటీ వెల్లడించింది. మూడు బ్యారేజీల్లో నీటి నిల్వకు అవకాశం లేదని తెలిపింది.

**ఆ లేఖ వెనుక దురుద్దేశాలు**

తుమ్మిడిహట్టి వద్ద నీళ్లు లేవన్న కేసీఆర్ నిర్ణయం నిజాయతీతో కూడింది కాదని జస్టిస్ పీసీ ఘోష్ కమిటీ పేర్కొంది. అక్కడ తగినంత నీరు ఉందని అప్పటి కేంద్రమంత్రి ఉమాభారతి చెప్పారు. 70శాతం నికర నీటి లభ్యత ఆధారంగా హైడ్రాలజీ క్లియరెన్స్ ఇచ్చినట్లు కేంద్రం లేఖ రాసింది. కేంద్రం నిర్ణయాన్ని కాదని నీటి లభ్యత లేదని గత ప్రభుత్వం లేఖ రాసింది. ఆ లేఖ వెనుక దురుద్దేశాలు ఉన్నాయని అర్థం అవుతోంది. కేసీఆర్ వేసిన నిపుణుల కమిటీ మేడిగడ్డ వద్ద బ్యారేజ్ వద్దని చెప్పింది. ప్రాణహిత మీద బ్యారేజ్ కట్టొచ్చని సూచించింది. నిపుణుల కమిటీ నివేదికను పక్కనపెట్టి, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని



పణంగా పెట్టి మేడిగడ్డ వద్ద బ్యారేజ్ కట్టాలని నిర్ణయించారు.

*** సీఎం నోటిమాట మేరకు కాంట్రాక్టులు**

ప్రాజెక్టుపై అప్పటి క్యాబినెట్ భేటీలో చర్చించలేదు. సీఎం నోటిమాట మేరకు కాంట్రాక్టులు ఇచ్చారు. ప్రజాధనం కాంట్రాక్టర్లకు ఇచ్చేందుకు విలువలను రివైజ్ చేశారు. మేడిగడ్డ నిర్మాణంపై అప్పటి నీటిపారుదల మంత్రి నిర్ణయం చట్టబద్ధం కాదు. మేడిగడ్డ నిర్మాణానికి ఇచ్చిన జీవోను క్యాబినెట్ సమావేశంలో పెట్టలేదు. ఇంతపెద్ద ప్రాజెక్టుకు క్యాబినెట్ ఆమోదం అవసరం.. తప్పనిసరి కూడా. క్యాబినెట్ ఆమోదం లేకుండా ప్రాజెక్టు నిర్మాణం చేయకూడదు. మేడిగడ్డ నిర్మాణానికి ఇచ్చిన జీవోలు 230, 231, నిర్మాణ అనుమతులు చట్ట వ్యతిరేకం. కాళేశ్వరం రూపకల్పన, నిర్మాణం, నిర్వహణ అన్నింటికీ కేసీఆర్ వ్యక్తిగతంగా బాధ్యుడని కమిటీ పేర్కొంది" అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరించారు.

## భారత రాష్ట్ర సమితికి మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు రాజీనామా

అచ్చంపేట: భారత రాష్ట్ర సమితికి మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖను ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు పంపారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నుంచి బాలరాజు రెండుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ప్రస్తుతం ఆయన ఆ జిల్లా భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడిగా ఉన్నారు.





## వేములవాడకు పోటెత్తిన భక్తులు

వేములవాడ గ్రామీణం: దక్షిణ కాశీగా పేరు పొందిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజన్న దర్శనానికి భక్తులు పోటెత్తారు. శ్రావణమాసం రెండో సోమవారం కావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. దర్శనానంతరం కోడె మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం స్వామివారికి వేద పండితులు మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఇన్‌ఛార్జి ఈవో రాధాబాయి, ఆలయ అధికారులు, ఎస్పీఎఫ్ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## దక్షిణ తెలంగాణ జిల్లాలకు భారీవర్ష సూచన

హైదరాబాద్: తెలంగాణలో మూడు, నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. దక్షిణ తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు నాలుగు రోజుల పాటు వర్ష సూచన ఉందని.. ఇవాళ సాయంత్రం నగరంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వెల్లడించారు.




## కాళేశ్వరంపై హరీష్ రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్



రాష్ట్రంలో కాళేశ్వరం అంశం కలకలం రేపుతోంది. సోమవారం కాళేశ్వరం కమిషన్ నివేదికపై కేబినెట్‌లో సుదీర్ఘంగా చర్చించారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ కీలక నిర్ణయం తీసుకుంది. మంగళవారం తెలంగాణ భవన్ వేదికగా కాళేశ్వరంపై ఆ పార్టీ నేత హరీష్ రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై బ్రీఫింగ్ ఇవ్వనున్నారు. కాగా, ప్రాజెక్టుకు సంబంధించి జస్టిస్ పీసీ ఘోష్ ఇచ్చిన నివేదికపై మంత్రివర్గంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ప్రభుత్వం నియమించిన అధ్యయన కమిటీ.. 650 పేజీల కాళేశ్వరం నివేదికను 60 పేజీల సారాంశంగా తయారు చేసింది. కేబినెట్‌కు సమర్పించిన ఈ సంక్షిప్త నివేదికలో 32 సార్లు కేసీఆర్, 19 సార్లు హరీశ్‌రావు, 5 సార్లు ఈటల రాజేందర్ ప్రస్తావన వచ్చినట్లు సమాచారం.

## మా యూనిఫాం హీరో...

## సిరాజ్ పై తెలంగాణ పోలీస్ డిపార్ట్ మెంట్ ప్రశంసలు

- **టీమిండియా బౌలర్ మహ్మద్ సిరాజ్‌పై హైదరాబాద్ పోలీసుల ప్రశంసలు**
- **ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచినందుకు అభినందనలు**
- **సిరాజ్ తెలంగాణకు గర్వకారణం అంటూ పోలీస్ శాఖ కితాబు**
- **ఆయన క్రీడల్లోనే కాదు, యూనిఫాంలోనూ హీరో అని ప్రశంస**
- **సిరాజ్ తెలంగాణ పోలీస్ శాఖలో డీఎస్పీగా పనిచేస్తున్న విషయం తెలిసిందే**

టీమిండియా స్టార్ పేసర్, హైదరాబాద్ ముద్దుబిడ్డ మహ్మద్ సిరాజ్‌పై తెలంగాణ పోలీస్ శాఖ ప్రశంసల జల్లు కురిపించింది. ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్ ను భారత్ సమం చేయడడంలో సిరాజ్ కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, సిరాజ్ అద్భుత ప్రదర్శనను అభినందిస్తూ పోలీస్ శాఖ ప్రత్యేకంగా స్పందించింది. సిరాజ్ కేవలం క్రీడాకారుడే కాకుండా, పోలీస్ శాఖలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ) హోదాలో ఉన్న అధికారి కావడం విశేషం. ఇంగ్లండ్‌తో జరిగిన చివరి టెస్టు మ్యాచ్‌లో సిరాజ్ తన అసాధారణ బౌలింగ్‌తో జట్టు విజయంలో ముఖ్య భూమిక పోషించాడు. ఈ విజయం తర్వాత సిరాజ్‌ను అభినందిస్తూ హైదరాబాద్ పోలీసులు తమ అధికారిక సోషల్ మీడియా ఖాతాలో ఓ పోస్ట్ చేశారు. "డీఎస్పీ మహ్మద్ సిరాజ్‌కు అభినందనలు. ఇంగ్లండ్‌పై భారత్ చారిత్రక టెస్టు గెలుపులో మీ ప్రదర్శన అమోఘం" అని పేర్కొన్నారు. అంతేకాకుండా, సిరాజ్‌ను 'తెలంగాణ గర్వకారణం' (ప్రైడ్ ఆఫ్ తెలంగాణ) అని అభి




వర్ణించారు. "క్రీడల్లోనే కాదు, యూనిఫాంలోనూ హీరో" (హీరో ఇన్ యూనిఫామ్ అండ్ స్పోర్ట్) అంటూ కితాబు ఇచ్చారు. తమ శాఖకు చెందిన అధికారి అంతర్జాతీయ స్థాయిలో రాణించడంపై తెలంగాణ పోలీస్ శాఖలో హర్షం వ్యక్తమవుతోంది.

## కౌశిక్‌రెడ్డిపై నమోదైన కేసులపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు

హైదరాబాద్: తనపై పలు పోలీసు స్టేషన్లలో నమోదైన కేసులను కొట్టివేయాలని భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని పలు పోలీసుస్టేషన్‌లలో కౌశిక్ రెడ్డిపై కేసులు నమోదయ్యాయి. కాంగ్రెస్ నేతలు ఇచ్చిన ఫిర్యాదుతో.. ఒకే ఘటనపై వేర్వేరు పోలీసు స్టేషన్‌లలో కేసులు పెట్టారని కౌశిక్ రెడ్డి న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు. కేసులపై స్టే విధించి, అరెస్టు చేయకుండా ఆదేశాలివ్వాలని మధ్యంతర పిటిషన్ వేశారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. అన్ని పోలీసు స్టేషన్లలో నమోదైన కేసులపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.



## ఈ పోరాటం చరిత్రలో నిలిచిపోతుంది: ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్: తెలంగాణ జాగృతి ఈరోజు చేసే పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ కవిత ధర్నాచౌక్ వద్ద 72 గంటల నిరాహార దీక్షను చేపట్టారు. బీఆర్ అంబేడ్కర్, పులే, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు ఆమె నివాళి అర్పించారు. కార్యక్రమానికి పెద్దఎత్తున కార్యకర్తలు, తెలంగాణ జాగృతి శ్రేణులు తరలివచ్చి ఆమెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. "తెలంగాణలో ప్రతి ఒక్కరికీ రాజ్యాధికారంలో వాటా కావాలి, ఆర్థిక అవకాశాలు రావాలి. సమాజంలో సగ భాగం బీసీలు ఉన్నారు. వాళ్లకు



రాజకీయంగా సమ ప్రాధాన్యం దక్కాలనే ఉక్కు సంకల్పంతో ఈ దీక్ష చేపట్టాం. కామారెడ్డి డిక్లరేషన్‌లో చెప్పినట్లు బీసీలకు న్యాయం చేయాలని గత కొన్ని నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం వెంట పడుతున్నాం. అందరి ఆకాంక్ష ఒకటే.. స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం భాజపా మీద నెపం పెట్టి తప్పించుకోవాలని చూస్తోంది. బీసీ బిల్లుపై భాజపా లేవనెత్తిన అనుమానాలను సీఎం నివృత్తి చేయాలి. ముస్లింలకు అదనంగా 10 శాతం రిజర్వేషన్లు ఇస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వాలి. ముస్లింలను మినహాయించి బీసీలకే 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని చెప్పాలి. అప్పుడు భాజపా ఎందుకు ఒప్పుకోదో మేమూ చూస్తాం. ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్‌కు ప్రత్యేకంగా పార్లమెంటులో బిల్లు పెట్టాలి. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇందుకు కృషి చేయాలి" అని కవిత అన్నారు.

## గతాన్ని గుర్తు చేసుకుని కంటతడి పెట్టుకున్న జగ్గారెడ్డి

కాంగ్రెస్ ఫైర్ బ్రాండ్ గా గుర్తింపు పొందిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కంటతడి పెట్టుకున్నారు. కార్యకర్తల సమావేశంలో తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. గతాన్ని గుర్తు చేసుకుని ఏడ్చేశారు. నియోజకవర్గంలోని కొండాపూర్ మండల కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నెల 7 జగ్గారెడ్డి కూతురు జయారెడ్డి వివాహం సంగారెడ్డి పట్టణంలోని రామాలయం వద్ద నిర్వహించనున్నారు. పెళ్లికి కార్యకర్తలను ఆహ్వానించడంతో పాటు ఇతర పార్టీ అంశాలు చర్చించుకోవడానికి సమావేశం పెట్టారు. మీటింగ్ మొదలు కాగానే గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ యువనేత రాహుల్ గాంధీ సమావేశాన్ని సంగారెడ్డి గ్రాండ్ గా నిర్వహించిన సందర్భాన్ని జగ్గారెడ్డి గుర్తు చేశారు. ఆ సమయంలో తన వద్ద డబ్బులు లేవని కష్టకాలంలో పార్టీ నాయకుడు ఆంజనేయులు తన భూమిని అమ్మి డబ్బు సహాయం చేశాడని గుర్తు చేసుకుని కన్నీళ్లు పెట్టుకున్నారు. ఎప్పుడు జోష్ గా నవ్వుతూ, మంచి ఉత్సాహంగా ఉండే జగ్గారెడ్డి



కన్నీరు పెట్టుకోవడం తో పార్టీ నాయకులు, కార్యకర్తలు వద్దు సార్ అంటూ ఓదార్చే ప్రయత్నం చేశారు. తీవ్ర భావోద్వేగానికి గురైన ఆయన సమావేశం నుంచి వెళ్లిపోయారు.

## 'నేను ఉన్నాను.. మీరు ధైర్యంగా ఉండండి'.. ఫిష్ వెంకట్ కుటుంబానికి సోనూసూద్ భరోసా

అనారోగ్యంతో ఇటీవల మృతిచెందిన తెలుగు నటుడు ఫిష్ వెంకట్ కుటుంబాన్ని నటుడు సోనూసూద్ పరామర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని ఫిష్ వెంకట్ ఇంటికి వెళ్లారు. భార్యా, పిల్లలతో మాట్లాడారు. బాధపడొద్దని ధైర్యం చెప్పారు. తాను తోడుగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం ఫిష్ వెంకట్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వెంకట్ మరణం తనను కలచివేసిందన్నారు. కాగా, కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ కొన్ని రోజుల క్రితం ఫిష్ వెంకట్ మరణించిన విషయం తెలిసిందే. వెంటనే స్పందించిన సోనూసూద్ తన వంతుగా వెంకట్ కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు.

# అనిల్ అంబానీని చుట్టుముడుతున్న కష్టాలు..
# బ్యాంకులకు ఈడీ నోటీసులు



రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీకి కష్టాలు చుట్టుముడుతున్నాయి. ఇటీవలే మనీలాండరింగ్ వ్యవహారంలో దర్యాప్తును ఎదుర్కొంటున్న ఆయనకు, తాజాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తన కంపెనీలకు మంజూరు చేసిన రుణాలపై వివరాలు కోరుతూ పలు బ్యాంకులకు లేఖ రాసింది. మొత్తం 12-13 బ్యాంకులకు ఈడీ నోటీసులు పంపినట్టు సంబంధిత వ్యక్తులు తెలిపారని ఎన్డీటీవీ ప్రాఫిట్ కథనం పేర్కొంది. ప్రధానంగా రిలయన్స్ హౌసింగ్ ఫైనాన్స్, రిలయన్స్ కమ్యూనికేషన్స్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్‌లకు మంజూరు చేసిన రుణాలకు సంబంధించిన వివరాలు కోరుతూ ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులకు నోటీసులు ఇచ్చింది. వాటిలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సహా యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యూకో, పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్‌లు ఉన్నాయి. ఈ బ్యాంకులు ఆయా కంపెనీలకు భారీ మొత్తంలో రుణాలిచ్చాయి. వాటిలో మొండి బకాయిలుగా మారిన కేసులకు సంబంధించి కొంతమంది బ్యాంకు అధికారులకు నోటీసులు ఇచ్చినట్టు, వారిని ప్రశ్నించేందుకు పిలిపించే అవకాశమూ ఉందని సమాచారం. రుణాల క్లియరెన్స్ ప్రాసెస్, ఎంతకాలానికి డిఫాల్ట్‌గా నిర్ణయించారు, వాటి ఖాతాల నుంచి రికవరీ చర్యల గురించి వారిని వివరణ ఇవ్వాలని కోరినట్టు తెలుస్తోంది. అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ గ్రూప్ కంపెనీలపై జరిగిన రూ. 3,000 కోట్ల రుణ మోసం కేసుకు సంబంధించి ఏజెన్సీ గతవారం మొదటి అరెస్టును చేసింది. బిస్వాల్ ట్రేడ్‌లింక్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పార్థసారథి బిస్వాల్‌ను శుక్రవారం మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎలే) 2002 కింద అరెస్టు చేశారు. అతను రిలయన్స్ పవర్ తరపున నకిలీ హామీ పత్రాలను సమర్పించిన ఆరోపణలున్నాయి. 20172019 మధ్య యెస్ బ్యాంక్ రిలయన్స్ గ్రూప్ కంపెనీలకు ఇచ్చిన రుణాలలో సుమారు 3,000 కోట్ల రూపాయలను దారి మళ్లించినట్లు వచ్చిన ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. రుణాలు మంజూరు చేయడానికి ముందే బ్యాంకు ప్రమోటర్లు కూడా కొంత మొత్తం అందుకున్నారని ఈడీ కనుగొంది. ఈ కేసు విషయంలో గత వారం అనిల్ అంబానీకి ఈడీ సమన్లు జారీ చేయడమే కాకుండా, ఇతర దేశాలకు వెళ్లకుండా లుకౌట్ నోటీసులు కూడా ఇచ్చింది.

# ఐదేళ్లలో రూ. 7.08 లక్షల కోట్ల జీఎస్టీ ఎగవేతలు



ఈ ఏడాది మార్చితో ముగిసిన 202425 ఆర్థిక సంవత్సరం వరకు గడిచిన ఐదేళ్లలో కేంద్ర జీఎస్టీ ఫీల్డ్ అధికారులు సుమారు రూ. 7.08 లక్షల కోట్ల విలువ చేసే జీఎస్టీ మోసాలను గుర్తించినట్టు ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇందులో దాదాపు రూ. 1.79 లక్షల కోట్లు ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ (ఐటీసీ) మోసాలు కూడా ఉన్నాయని ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరీ సోమవారం పార్లమెంటుకు తెలియజేశారు. ఒక్క 202425లోనే రూ. 2.23 లక్షల కోట్లకు వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) ఎగవేతను అధికారులు గుర్తించినట్టు డేటా చెబుతోంది. ఈ మొత్తానికి సంబంధిని 30,056 జీఎస్టీ ఎగవేత కేసులు నమోదవగా, ఇందులో సగానికి పైగా(15,283) కేసులు ఐటీసీ మోసాలకు సంబంధినవిగా, విలువ పరంగా రూ. 58,772 కోట్ల వరకు ఉంది. అంతకుముందు 202324లో రూ. 2.30 లక్షల కోట్ల జీఎస్టీ ఎగవేతలు జరిగాయి, ఇందులో రూ. 36,374 కోట్ల ఐటీసీ మోసాలు ఉన్నాయి. 2023లో రూ. 1.32 లక్షల కోట్లు, 2022లో రూ. 73,238 కోట్లు, 2021లో రూ. 49,384 కోట్ల జీఎస్టీ ఎగవేతలను అధికారులు గుర్తించారు. జీఎస్టీ సంబంధిత మోసాలను గుర్తించడానికి 2020లో ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్‌ను ప్రారంభించింది. అప్పటి నుంచి ఈ మోసాలను అధికారులు గుర్తిస్తారు. ఈడీ, సీబీఐ, డీఆర్ఐ, డీజీజీఐ సంస్థల మధ్య ఉన్న సమన్వయం కారణంగా జీఎస్టీ ఎగవేతలను గుర్తిస్తున్నట్టు అధికారులు తెలిపారు. వీటిని అరికట్టేందుకు అనేక చర్యలు కూడా తీసుకున్నారు. ఈవే బిల్లులు, రిజిస్ట్రేషన్ల తనిఖీలు, జీఎస్టీ రిటర్నుల ధృవీకరణ, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ క్లెయిమ్‌లపై పరిమితి ద్వారా జీఎస్టీ ఎగవేతలను నిలువరిస్తున్నారు. ఈ కారణంగానే దేశ జీఎస్టీ వసూళ్లు రికార్డు స్థాయిలో జరుగుతున్నాయి.




### భారత్‌లో తొలి తయారీ ప్లాంట్
# ప్రారంభించిన విన్‌ఫాస్ట్...




వియత్నాం ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ విన్‌ఫాస్ట్ భారత మార్కెట్లో దూకుడుగా వ్యవహరిస్తోంది. వారం రోజుల క్రితమే మనదేశంలో మొదటి షోరూమ్‌ను ఏర్పాటు చేసిన కంపెనీ సోమవారం తన తొలి తయారీ ప్లాంటును ప్రారంభించింది. తమిళనాడులోని తూత్తుకుడిలో రూ. 16,000 కోట్లతో దీన్ని మొదలుపెట్టింది. ఇది ప్రపంచంలోనే కంపెనీకి చెందిన మూడో ప్లాంట్ కావడం గమనార్హం. ప్రారంభంలో ఈ ప్లాంట్ నుంచి విన్‌ఫాస్ట్ ప్రీమియం ఎస్‌యూవీ మోడళ్లు వీఎఫ్7, వీఎఫ్6 అసెంబుల్ చేయనున్నారు. మొదటి సంవత్సరంలో 50,000 కార్లను, మార్కెట్ డిమాండ్ ఆధారంగా ఏటా 1.50 లక్షల యూనిట్లను తయారు చేయాలని భావిస్తున్నట్టు విన్‌ఫాస్ట్ ఆసియా సీఈఓ ఫామ్ సాన్ చౌ అన్నారు. ప్రపంచ ఈవీ పరిశ్రమ భవిష్యత్తులో ఈ ప్లాంటు కీలకపాత్ర పోషిస్తుందని ఆశిస్తున్నాం. తూత్తుకుడిలోని ప్లాంటు అధునాతన ఆటోమేషన్, టెక్నాలజీ ద్వారా ప్రపంచ స్థాయి ప్రమాణాలతో సిద్ధంగా ఉంది. భారత వినియోగదారులకు అధిక నాణ్యత, పోటీ ధరలకు ఎలక్ట్రిక్ వాహనాలను అందించే లక్ష్యంతో ఉన్నామని సాన్ చౌ తెలిపారు. పూర్తి సామర్థ్యంతో పనిచేస్తే ఈ ప్లాంటు 3,000-3,500 ప్రత్యక్ష ఉద్యోగాలను, సరఫరాలో పరోక్షంగా మరెంతో మందికి ఉపాధిని కల్పిస్తుంది. మరోవైపు, తూత్తుకుడి ప్లాంటుతో పాటు దక్షిణాదిన మరో తయారీ యూనిట్ ఏర్పాటు కోసం విన్‌ఫాస్ట్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో సంప్రదింపులు జరుపుతోంది. మరింత విస్తరణ ప్రణాళికలో భాగంగా తమిళనాడుతో పాటు తెలంగాణ, ఏపీలోనూ ప్లాంటు ఉండాలని భావిస్తున్నామని సాన్ చౌ చెప్పారు. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చలు జరుపుతున్నాం, మౌలిక సదుపాయాలు, ఇతర అంశాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

# ఎల్‌టీఐమైండ్‌ట్రీకి పాన్ 2.0 ప్రాజెక్ట్

దిల్లీ: పాన్ 2.0 ప్రాజెక్ట్‌కు సంబంధించి కీలక ముందుడుగు పడింది. ఈ ప్రాజెక్ట్ పనులను ప్రముఖ టెక్నాలజీ కన్సల్టింగ్, డిజిటల్ సొల్యూషన్స్ సంస్థ ఎల్‌టీఐమైండ్‌ట్రీకి ఆదాయపు పన్ను విభాగం అప్పగించింది. ఏడాదిన్నర తర్వాత పాన్ 2.0 సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ప్రాజెక్ట్‌లో భాగంగా PAN, TAN అలాట్‌మెంట్, అప్‌డేట్స్/కరెక్షన్లు, ఆధార్ పాన్ లింకింగ్, ఆన్‌లైన్ పాన్ వ్యాలిడేషన్ వంటి సేవలు ఒకేచోట లభించనున్నాయి. దీనికి సంబంధించి వివిధ పోర్టళ్లు ఏకీకృతం చేయనున్నారు. ప్రస్తుతం మూడు వేర్వేరు పోర్టళ్లు ఉన్నాయి. శాశ్వత ఖాతా సంఖ్య (పాన్)ను ప్రభుత్వ ఏజెన్సీలకు చెందిన అన్ని డిజిటల్ వ్యవస్థల్లో 'సాధారణ వ్యాపార గుర్తింపు'గా చేసేందుకు రూ.1,435 కోట్లతో పాన్ 2.0 ప్రాజెక్ట్‌ను కేంద్రం గతేడాది ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఆర్థిక వ్యవహారాలపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ సంఘం ఈ ప్రాజెక్ట్‌కు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్ట్ చేపట్టేందుకు వివిధ కంపెనీలు పోటీపడగా.. ఎల్‌టీఐమైండ్‌ట్రీ విజయవంతమైన బిడ్డర్‌గా నిలిచింది. ఈ ప్రాజెక్ట్ పూర్తవ్వడానికి దాదాపు 18 నెలలు పడుతుందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. రూ.792 కోట్లకు బిడ్ దాఖలు చేసినట్లు డాక్యుమెంట్ల ద్వారా తెలుస్తోంది.




# టెక్నాలజీ

# వీవో నుంచి వై400 5జీ ఫోన్.. ధర, ఫీచర్లివే!




ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ వివో భారత్ మార్కెట్లోకి కొత్త స్మార్ట్ ఫోన్‌ను విడుదల చేసింది. వివో వై400 5జీ పేరిట దీన్ని తీసుకొచ్చింది. 6,000 ఎంఏహెచ్ బ్యాటరీ, 50ఎంపీ ప్రధాన కెమెరాతో దీన్ని రూపొందించారు. వీవో వై400 5జీలో 6.67 అంగుళాల ఫుల్ హెచ్‌డీ ప్లస్ అమోలెడ్ డిస్‌ప్లే ఇచ్చారు. 120Hz రిఫ్రెష్ రేటు, 1,800 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో వస్తోంది. ఆండ్రాయిడ్ 15 ఆధారిత ఫన్‌టచ్ ఓఎస్ 15తో పనిచేస్తుంది. ఇక కెమెరా విషయానికొస్తే.. ఫోన్ వెనకభాగంలో 50 ఎంపీ సోనీ IMX852 ప్రధాన కెమెరా, 2 ఎంపీ డెప్త్ సెన్సార్ ఇచ్చారు. 32ఎంపీ సెల్ఫీ కెమెరా ఇచ్చారు. ఇందులో స్నాప్‌డ్రాగన్ 4 జన్ 2 ప్రాసెసర్‌ను అమర్చారు. ఇది 6,000 ఎంఏహెచ్, 90W ఫాస్ట్ ఛార్జింగ్ సపోర్ట్ చేస్తుంది. వివో వై400 5జీ రెండు వేరియంట్లలో లభిస్తుంది. 8జీబీ + 128జీబీ వేరియంట్ ధర రూ.21,999 కాగా.. 8జీబీ + 256జీబీ వేరియంట్ ధర రూ.23,999గా వివో పేర్కొంది. ఇది గ్లామ్ వైట్, ఆలివ్ గ్రీన్ కలర్స్‌లో లభిస్తుంది. వివో ఇండియా అధికారిక వెబ్‌సైట్, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్‌తో పాటు ఎంపిక చేసిన రిటైల్ స్టోర్లలో ఈ నెల 7నుంచి కొనుగోలు చేయొచ్చు. ఎంపిక చేసిన కార్డ్‌లపై కొనుగోలుకు 10 శాతం వరకు క్యాష్‌బ్యాక్ ఇస్తున్నట్లు కంపెనీ తెలిపింది.

# ఎప్పుడూ ఊహించని కొత్త ఉద్యోగాలొస్తాయ్..




ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వ్యవస్థలు రోజురోజుకూ మెరుగవుతున్నకొద్దీ మానవ ఉద్యోగాలు పోతాయన్న ఆందోళన పెరుగుతోంది. మనుషులు చేయగలిగే పనులన్నీ ఏఐ చేసేస్తుండటంతో మానవ ఉద్యోగాలను త్వరలోనే ఈ కొత్త ఏఐ టూల్స్ భర్తీ చేసే ప్రమాదం ఎక్కువవుతోంది. టెక్ దిగ్గజాల సీఈవోలూ ఇదే హెచ్చరిస్తున్నారు. రాబోయే సంవత్సరాల్లో తమ కంపెనీలోని ఉద్యోగులను ఏఐ తగ్గిస్తుందని స్వయంగా అమెజాన్ సీఈఓ ఆండీ జాస్సీనే కొన్ని వారాలుగా చెబుతూ వస్తున్నారు. ప్రతి ఒక్కరి ఉద్యోగాలు ప్రభావితమవుతాయని ఎన్విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్ కూడా ఇటీవల హెచ్చరించారు.

### సమూల మార్పు

అయితే, ఈ క్రమంలో ఉద్యోగుల్లో ఏఐపై ఉన్న భయాల్ని పోగొట్టేలా గూగుల్ డీప్ మైండ్ సీఈఓ డెమిస్ హస్సాబిస్ ఆసక్తిక వ్యాఖ్యలు చేశారు. ఓ అడుగు ముందుకేసి ప్రస్తుతం ప్రత్యామ్నాయంగానే ఉన్న కృత్రిమ మేధస్సుతో రాబోయే ఐదు నుండి పదేళ్లలో ఉద్యోగ భావనలోనే సమూల మార్పు సంభవించవచ్చని అభిప్రాయపడ్డారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల ఎప్పుడూ ఊహించని విధంగా కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయని 'వైర్డ్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. "ఉద్యోగ ప్రపంచంలో చాలా మార్పు ఉంటుందని నేను అనుకుంటున్నాను. కానీ గతంలో మాదిరిగానే మెరుగైన కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయి. ఇవి ఈ సాధనాలు లేదా కొత్త సాంకేతికతలను ఉపయోగిస్తాయి" అని హస్సాబిస్ అన్నారు.

### డాక్టరుకూ ముప్పు?

ప్రస్తుతం మానవులు చేసే ప్రతి పనినీ ఏజీఐ లేదా ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ చేయగలిగితే, రానున్న కొత్త ఉద్యోగాలను కూడా ఈ సాంకేతిక పరిజ్ఞానం భర్తీ చేయకుండా ఆపగలమా అన్న ప్రశ్న కూడా ఉత్పన్నమైంది. దీనికి హస్సాబిస్ బదులిస్తూ ఒక వైద్యుడి స్థానాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ భర్తీ చేయగలదు కానీ నర్సులను కాదు అన్నారు. "సాధారణంగా డాక్టర్ ఏం చేస్తారు.. డాక్టర్ చేసే రోగ నిర్ధారణను ఏఐ టూల్ సాయంతో చేయవచ్చు. లేదా పూర్తిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తరహా డాక్టర్లు రావచ్చు. కానీ నర్సులు అలా కాదు. ఎందుకంటే నర్సుల ఉద్యోగంలో మానవ సహానుభూతి ఎక్కువగా ఉంటుంది" అని వివరించారు.

# వైరల్, ట్రెండింగ్

# కవితక్క.. పార్టీ మీ సొంత ఆస్తి అనుకోవద్దు..
# బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త సంచలన లేఖ వైరల్

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత ఇటీవల చేసిన వ్యాఖ్యలపై తెలంగాణలో రాజకీయ దుమారం చెలరేగుతోంది. ముఖ్యంగా బీఆర్‌ఎస్ పార్టీలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్సీ కవిత కు బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త రాసినట్లుగా ఒక లేఖ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. లేఖలో ఉన్న ప్రకారం.. 'మా ఆడబిడ్డ కవితక్కకి.. 2023లో అనుకోకుండా బీఆర్‌ఎస్ పార్టీ ఓడిపోయింది. వెంటనే కేసీఆర్ గారికి పెద్ద గాయం తగిలిన విషయం తెలిసిందే. ఆ దెబ్బ ఇంకా కోలుకోకముందే మీరు అరెస్టయ్యారు. ఆ బాధలో ఉన్న సమయంలో పది మంది ఎమ్మెల్యేలు, ఎంపీ అభ్యర్థులు పార్టీకి నమ్మక ద్రోహం చేసి వెళ్లిపోయారు. అంతలోనే ప్రమాదవశాత్తు కంటోన్మెంట్ ఎమ్మెల్యే మరణం. దీనితోపాటు వెంటనే పార్లమెంట్ ఎన్నికలు వచ్చాయి. బీఆర్‌ఎస్ పార్టీకి అక్కడ దారుణమైన ఓటమి ఎదురైంది' అని లేఖలో పేర్కొన్నారు. మీ ఇంట్లో కొట్లాట మీ కుటుంబంతో మాట్లాడుకోండి.. ఇన్ని బాధలు, ఇన్ని కష్టాలు చూసిన బీఆర్‌ఎస్ పార్టీకి, శక్తిని ఇచ్చింది.. పునర్జీవం పోసింది మన బీఆర్‌ఎస్ పార్టీ సామాన్య సోషల్ మీడియా వారియర్లు మాత్రమేనని లేఖలో రాసుకొచ్చారు. అసెంబ్లీ ఎన్నికలయ్యి 20 నెలలు పూర్తవుతున్నాయని, ఈ కష్టకాలంలో బీఆర్‌ఎస్ చేస్తున్న పోరాటంలో ఎంతో మంది సోషల్ మీడియా కార్యకర్తలు కేసుల్లో చిక్కుకుపోయారని, జైళ్లకు వెళ్లారని తెలిపారు. వారిలో చాలామందికి పార్టీ పదవుల మీద ఆశ లేదని, అయినా, వాళ్లు నిస్వార్థంగా పోరాడుతున్నారని ఆవేదన తెలిపారు. అలాంటి బీఆర్‌ఎస్ పార్టీ మీద, కార్యకర్తలపై మీరు చేసిన అనవసరమైన వ్యాఖ్యలు వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయని పేర్కొన్నారు. మీరు చేసిన వ్యాఖ్యలలో ముఖ్యంగా బీఆర్‌ఎస్ పార్టీ బీజేపీలో విలీనమవుతుందని, సామాజిక తెలంగాణ రాలేదని, నిజామాబాద్‌కి నిధులు ఇవ్వలేదని, పార్టీలో దెయ్యాలు ఉన్నాయని వ్యాఖ్యలు చేసి, ఇప్పుడు పార్టీకి ఎంతో కాలంగా సేవలు చేసిన సీనియర్ నాయకుడిని "లిల్లిపుట్" అని టార్గెట్ చేయడం బాధాకరమని వెల్లడించారు.



# ఐదో టెస్టులో విక్టరీ.. ఇంగ్లాండ్‌ను వెనక్కి నెట్టిన భారత్



ఐదు టెస్టులో ఇంగ్లాండ్‌పై విజయంతో భారత్ వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ 2025 27లో తన స్థానాన్ని మెరుగుపర్చుకుంది. ఒక్క స్థానాన్ని ఎగబాకి 3వ స్థానానికి చేరుకుంది. ఈ మ్యాచ్ కంటే ముందు భారత్ 4వ స్థానంలో ఉండేది. ఇంగ్లాండ్ ఒక్క స్థానం కోల్పోయి 4వ స్థానానికి పడిపోయింది. డబ్ల్యూటీసీ సర్కిల్‌లో ఇరు జట్లుకు ఇదే మొదటి సిరీస్. ఐదు టెస్టుల్లో ఇరు జట్లు చెరో రెండు విజయాలు, రెండు ఓటములు పొందాయి. ఓ మ్యాచ్‌ను డ్రా చేసుకున్నాయి. భారత్ 28 పాయింట్లు, 46.67 పర్సెంటేజ్‌తో మూడో స్థానంలో ఉండగా.. ఇంగ్లాండ్ 26 పాయింట్లు, 43.33 పర్సెంటేజ్‌తో 4వ స్థానంలో ఉంది. ఆస్ట్రేలియా(36 పాయింట్లు, 100 పర్సంటేజ్) అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. శ్రీలంక(16 పాయింట్లు, 66.67 పర్సెంటేజ్) రెండో స్థానంలో ఉంది.

# బుమ్రాకు రెస్ట్ ఇవ్వడానికి వర్క్‌లోడ్ కారణం కాదా?..

* **బయటపడిన అసలు విషయం**

టీమిండియా స్టార్ బౌలర్ జస్ప్రిత్ బుమ్రా ఇంగ్లాండ్‌తో ఐదో టెస్టు ఆడని విషయం తెలిసిందే. ఇంగ్లాండ్ పర్యటనకు ముందే బుమ్రా మూడు టెస్టులే ఆడతాడని టీమ్ మేనేజ్‌మెంట్ తెలిపింది. నాలుగో టెస్టుతోనే అతను ఆడాల్సిన మూడు మ్యాచ్‌లు పూర్తయ్యాయి. దీంతో పనిభారం కారణంగా ఐదో టెస్టుకు అతనికి విశ్రాంతినిచ్చారు. ఓవల్ టెస్టు ఆడకపోవడానికి వర్క్‌లోడే కారణమని అందరూ అనుకున్నారు. కానీ, అసలు కారణం అది కాదని తెలుస్తోంది. బుమ్రా గాయపడినట్టు జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. అతను మోకాలి గాయంతో బాధపడుతున్నట్టు సదరు కథనాలు తెలిపాయి. 'దురదృష్టవశాత్తు బుమ్రా మోకాలి గాయంతో బాధపడుతున్నాడు. అయితే ఆ గాయం అంత పెద్దదేమీ కాదు. సర్జరీ అవసరం లేదు. ప్రస్తుతం బీసీసీఐ మెడికల్ టీమ్ అతన్ని పర్యవేక్షిస్తుంది. స్కానింగ్



రిపోర్ట్స్ కోసం ఎదురుచూస్తున్నాం'అని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపినట్టు సదరు కథనాలు పేర్కొన్నాయి. అయితే, బుమ్రా గాయాన్ని టీమ్ మేనేజ్‌మెంట్ గోప్యంగా ఉంచడంలోఆంతర్యమేంటని నెటిజన్లు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. పనిభారం కారణంగా విశ్రాంతి ఇవ్వడంలో ఎవరికి సందేహాలు లేవు. కానీ, జట్టు నుంచి రిలీజ్ చేయడంతో అనుమానాలు తలెత్తాయి. ఏ ప్లేయరైనా తుది జట్టులో లేకపోయినా పర్యటన ముగిసే వరకు జట్టుతోనే ఉంటాడు. కానీ, బుమ్రా విషయంలో మాత్రం అలా జరగలేదు. అందుకు కారణం బుమ్రా గాయపడటమే అని తాజా కథనాలు పేర్కొన్నాయి. వచ్చే నెలలో ఆసియా కప్, ఆ తర్వాత వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్ నేపథ్యంలోనే బుమ్రా విషయంలో టీమ్ మేనేజ్‌మెంట్ రిస్క్ తీసుకోలేదని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే, ఆసియా కప్ నాటికి అతను కోలుకుంటాడా?అన్నది ప్రశ్నార్థకం. ఇంగ్లాండ్ పర్యటనలో మూడు టెస్టుల్లో బుమ్రా 14 వికెట్లు తీశాడు.

## మా కోడలు.. కో-ఛైర్‌పర్సన్ అయింది.. : చిరు స్పెషల్ పోస్ట్



హైదరాబాద్: తన కోడలు ఉపాసనకు అగ్ర కథానాయకుడు చిరంజీవి శుభాకాంక్షలు చెప్పారు. రాష్ట్ర స్పోర్ట్స్ హబ్‌కు కోఛైర్‌పర్సన్‌గా తెలంగాణ ప్రభుత్వం ఉపాసనను నియమించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో చిరంజీవి సంతోషం వ్యక్తం చేస్తూ పోస్ట్ పెట్టారు. ''మా కోడలు ఉపాసన ఇప్పుడు తెలంగాణ స్పోర్ట్స్ హబ్‌కు కోఛైర్‌పర్సన్. ఆమెను గౌరవప్రదమైన ఈ పదవిలో నియమించడం సంతోషంగా ఉంది. ఇది గౌరవం అనడం కన్నా కూడా బాధ్యతను మరింత పెంచిందని చెప్పాలి. డియర్ ఉపాసన.. మీకున్న నిబద్ధత, ప్యాషన్‌తో క్రీడల్లో దాగి ఉన్న అపార ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తారని, ప్రతిభావంతులను అగ్ర స్థానంలో నిలబెట్టడానికి తగిన విధి విధానాలను రూపొందించడంలో నీ వంతు కృషి చేస్తావని ఆశిస్తున్నాను. సదా నీకు దేవుడు దీవెనలు తోడుగా ఉంటాయి'' అని పేర్కొన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ హబ్‌కు కోఛైర్‌పర్సన్ బాధ్యతను అప్పగించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ఉపాసన కృతజ్ఞతలు తెలిపారు. ఈ నియామకం తనకెంతో గౌరవాన్నిచ్చిందని పేర్కొన్నారు. సంజీవ్ గోయెంకాతో కలిసి పనిచేసే అవకాశం రావడం మరింత గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు.



”

మెహ్రీన్ పిర్జాదా ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక అందమైన చిత్రాన్ని షేర్ చేశారు. ఆమె అందంగా అలంకరించబడిన మెట్లపై @ rimzimdaduofficial రూపొందించిన స్టైలిష్ మెటాలిక్ డ్రెస్ ధరించి పోజులిచ్చింది. ఆమె డ్రెస్ పదునైన ప్లీట్స్ మరియు ఆధునిక కట్‌తో కూడిన శిల్ప రూపాన్ని కలిగి ఉంది. ఆమె దానిని నల్లటి లేడీ డియోర్ హ్యాండ్‌బ్యాగ్‌తో జత చేసింది. నేపథ్య లైట్లు ఫోటోకు మృదువైన మరియు గొప్ప అనుభూతిని ఇచ్చాయి. ఈ చిత్రాన్ని @lakshaysachdevaphotography క్లిక్ చేసింది.

# సినిమా

## అప్పుడే నా పెళ్లి

టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ పేరు నిత్యం సోషల్ మీడియాలో మారుమోగుతుంది. సినిమాల కంటే ఎక్కువగా పర్సనల్ లైఫ్ గురించి ఏదోక వార్త నెట్టింట హల్చల్ చేస్తుంటుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన పెళ్లి గురించి క్లారిటీ ఇచ్చాడు విజయ్. వచ్చే రెండేళ్లలో సరైన టైం అనిపించినప్పుడు మ్యారేజ్ చేసుకుంటానని చెప్పాడు. కాగా రష్మికతో విజయ్ డేటింగ్‌లో ఉన్నట్లు కొంత కాలంగా ప్రచారం జరుగుతోంది. ఈ ఇద్దరు చాలాసార్లు విదేశాల్లో ఒకే ప్లేస్ లో.. కనిపించిన ఫొటోలు కూడా గతంలో వైరల్ అయ్యాయి. ఇటీవల 'కింగ్డమ్' రిలీజ్ రోజు వీరిద్దరూ 'మనం కొట్టినం' అంటూ ట్వీట్లు కూడా చేయడం గమనార్హం. ఇక రౌడీ బాయ్ విజయ్ కింగ్డమ్‌తో చాలా రోజుల తర్వాత మంచి హిట్ కొట్టాడు. ఇప్పుడు ఆయన చేతిలో అరడజను ప్రాజెక్టులు ఉన్నాయి. రాహుల్ సాంకృత్యాయన్ డైరెక్షన్‌లో మైత్రీ మూవీస్‌తో కలిసి రాయలసీమ నేపథ్యంలో చిత్రం చేయనున్నాడు. షూటింగ్ ఆగస్టు చివర్లో ప్రారంభం కానుంది. వికిరణ్ కోలా దర్శకత్వంలో దిల్ రాజు బ్యానర్‌పై ఆంధ్రా కల్చరల్ బ్యాక్‌డ్రాప్‌లో ఓ చిత్రం చేయనున్నాడు. విలేజ్ ఫ్లేవర్‌తో వినూత్నంగా తెరకెక్కించబోతున్నారని టాక్. సుకుమార్ దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నట్టు సమాచారం. అలాగే కింగ్‌డమ్ బ్లాక్ బస్టర్ హిట్ కాడంతో ఇప్పుడు దానికి పార్ట్ 2 (సీక్వెల్), పార్ట్ 3 (ప్రీక్వెల్) కూడా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.



# కలల రాణి



అనిత్ పద్దా.. ఇటీవల గూగుల్ ట్రెండింగ్‌లో ఉన్న పేరు ఇది. నటించిన ఫస్ట్ మూవీతోనే ఓవర్ నైట్ సెన్సేషన్‌గా అవతరించిన ఈ బ్యూటీ ప్రస్తుతం దేశ వ్యాప్తంగా యూత్ హృదయాల్లో గిలిగింతలు పెడుతోంది. అద్భుతమైన అందం, అంతకు మంచిన అభినయంతో కుర్రకారులో గుబులు రేపుతోంది. అహాన్ పాండేతో ఈ భామ జంటగా మోహిత్ సూరి తెరకెక్కించిన 'సయ్యారా' మూవీ బాక్సాఫీస్ వద్ద హవా సాగిస్తూ రూ.300 కోట్ల క్లబ్‌లో అడుగు పెట్టేందుకు సిద్ధంగా ఉంది. రిలీజైన 15 రోజుల్లో 297 కోట్ల నిరక వసూళ్లు సాధించింది. ఓవైపు 'సయ్యారా' రికార్డులు, మరోవైపు అందులో నటించిన నవతరం నటీనటుల గురించి ఇంట్రెస్టింగ్ చర్చ సాగుతోన్న వేళ.. తాజాగా అనీత్ పద్దా లింక్డ్‌ఇన్ ప్రొఫైల్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతోంది. అందులో ఈ భామ తన విద్యాభ్యాసం సహా భవిష్యత్ లక్ష్యాల గురించి ప్రస్తావించింది. హెచ్.ఆర్.గా పనిచేస్తూ జాబ్ రిక్రూట్‌మెంట్స్ చేసేందుకు ఇంట్రెస్ట్‌గా ఉన్నట్లు తెలిపింది. ఆమె లింక్డ్‌ఇన్ ప్రొఫైల్ చూశాక.. ఒక సాధారణ అమ్మాయి ఇలాంటి అసాధారణ విజయాన్ని కలలో కూడా ఊహించి ఉండకపోవచ్చనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. కానీ ఇప్పుడామె దేశవ్యాప్తంగా యూత్ కలల రాణిగా మారింది. ఎందరికో స్ఫూర్తి నింపుతోంది.

# హను అబ్బవరం



**కుమారుడి పేరు రివీల్‌చేసిన కిరణ్**

యంగ్‌టాలెంటెడ్‌హీరో కిరణ్ అబ్బవరం, నటి రహస్య గోరక్ దంపతులకు కొద్దిరోజుల క్రితం కుమారుడు జన్మించిన సంగతి తెలిసిందే. అయితే, తాజాగా బాబుతో పాటుగా వారందరూ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వారి బిడ్డకు శ్రీవారి సన్నిధిలోనే నామకరణం చేశారు. బాబుకి 'హను అబ్బవరం' అని పేరు పెట్టామని రివీల్ చేశారు. దర్శనం అనంతరం వేదపండితులు కిరణ్ కుటుంబ సభ్యులకు వేదాశీర్వచనం ఇచ్చారు. ఈ సందర్భంగా కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ 'స్వామి సన్నిధిలో బాబుకి నామకరణం చేయడానికి వచ్చాం. కనులారా స్వామిని దర్శించుకున్నాం. బాబుకి హను అబ్బవరం అని నామకరణం చేశాం. స్వామి అనుగ్రహం ఎప్పుడూ ఉండాలని కోరుకుంటున్నం' అని తెలిపారు. ఇక సినిమాల విషయానికొస్తే...'కిరణ్.. ప్రస్తుతం కే ర్యాంప్, చెన్నై లవ్ స్టోరీ సినిమాల్లో నటిస్తున్నాడు. ఈ నెలలో మరో మూవీ షూటింగ్ ప్రారంభం కానుంది. రహస్యా గోరక్, కిరణ్ అబ్బవరం కలిసి రాజావారు రాణివారు చిత్రంలో నటించారు. ఆ సమయంలోనే ఇద్దరూ ప్రేమలో పడ్డారు. ఆ తర్వాత పెళ్లి చేసుకుని పండండి మగబిడ్డకు జన్మనిచ్చారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.